ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
ఆదివారం 28 సెప్టెంబరు 2025

బలాన్నిచ్చే బతుకమ్మ ఫలహారాలు

- ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలకు నిలయం
- తొమ్మిది రోజులు.. తొమ్మిది రకాలు..
- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

7



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ జిల్లా జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్ల వివరాలు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
చెన్నారావుపేట	జనరల్ మహిళ	జనరల్ మహిళ
దుగ్గొండి	జనరల్	జనరల్
గీసుగొండ	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
ఖానాపురం	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
నల్లబెల్లి	బీసీ జనరల్	బీసీ జనరల్
నర్సంపేట	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
నెక్కొండ	బీసీ జనరల్	బీసీ మహిళ
పర్వతగిరి	బీసీ జనరల్	బీసీ జనరల్
రాయపర్తి	బీసీ మహిళ	బీసీ మహిళ
సంగెం	బీసీ మహిళ	బీసీ జనరల్
వర్ధన్నపేట	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ



ఎవరు.. ఎక్కడ?!

ఖరారైన జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు

- కులగణన సర్వే ప్రాతిపదికన బీసీ స్థానాలకు కేటాయింపు
- 68.2 శాతానికి పెరిగిన బీసీల జనాభా నిష్పత్తి
- డ్రా పద్ధతి ద్వారా నిర్ణయించిన అధికారులు
- గతంలో కన్నా పెరిగిన బీసీల సీట్లు
- ఆశావహుల్లో వెల్లివిరుస్తున్న సంతోషం
- గ్రామాల్లో మొదలైన స్థానిక సంస్థల సందడి

6

వరంగల్ జడ్పీ చైర్‌పర్సన్ ఎస్టీ జనరల్

- ఉమ్మడి జిల్లాకు ఖరారైన రిజర్వేషన్లు
- 2 ఎస్టీలకు, 2 ఎస్సీలకు 1 బీసీకి, 1 జనరల్‌కు రిజర్వు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం శనివారం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లా పరిషత్‌లలో రెండు ఎస్టీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి బీసీకి రిజర్వు కాగా, ఒకటి జనరల్ అయింది. మూడు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు మహిళలకు కేటాయించారు. మూడు జనరల్‌గా ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలులోకి వచ్చినప్పటికీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులను రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని రిజర్వు చేయడం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ వర్గానికి ఒక్క స్థానమే దక్కింది. హనుమకొండ జిల్లా పరిషత్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, వరంగల్ జిల్లా పరిషత్ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. జనగామ ఎస్సీ మహిళ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీసీ జనరల్, ములుగు ఎస్టీ మహిళకు, మహబూబాబాద్ జనరల్ రిజర్వు అయింది.

భువనేశ్వరిగా భద్రకాళి అమ్మవారు

- ఆరో రోజుకు చేరిన నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి సతీమణి



ఆలయంలో పూజలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి సతీమణి నందిని

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరోరోజు శనివారం ఉదయం 4 గంటలకు నిత్య పూజ అనంతరం ప్రధానార్చకుడు భద్రకాళి శేష నేతృత్వంలో అమ్మవారిని భువనేశ్వరి మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. శాస్త్రప్రకారం ఈ ఏడాది నవరాత్రులు పది రోజులు వచ్చాయని శేష తెలిపారు. అమ్మవారిని ఆరో రోజున భవానీమాతగా అలంకరిస్తాం.. కానీ ఈ ఏడాది పది రోజులు నవరాత్రి ఉత్సవాలు వచ్చినందున భువనేశ్వరి మాతగా అలంకరించి పూజలు చేశామని అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధోత్సవం, సాలబంజిక సేవను నిర్వహించామన్నారు. 18 మెట్లపై ఉన్న అమ్మవారిని అధిరోహిస్తూ ఈ జగన్మాతను దర్శించడంవల్ల విజయ ప్రాప్తి కలుగుతుందని తెలిపారు. అమ్మవారి ఉభయదాత సేవా కర్తలు పూజలు నిర్వహించగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాదం అందించారు.

ఉప ముఖ్యమంత్రి సతీమణి పూజలు

ఉపముఖ్యమంత్రి సతీమణి నందిని భట్టి విక్రమార్క శనివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేష ఆమెకు ఆశీర్వచనం, అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రామల సునిత, ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

రెండోరోజు మద్యం దరఖాస్తులు నిల్

ఫీజు పెంచినందుకా..? ముహూర్తం లేనందుకా..?

వరంగల్ క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసి రెండు రోజులైనప్పటికీ ఆబ్కారీ అధికారులు ఏర్పాటు చేసిన దరఖాస్తు కౌంటర్లు వెలవెలబోతున్నాయి. వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక్క దరఖాస్తు దాఖలు కాలేదు. గతంలో టెండర్ ఫీజు రూ.2లక్షలు (నాన్ రిఫండబుల్)ను కొత్త మద్యం పాలసీలో రూ.3లక్షలకు పెంచడంతో దరఖాస్తులకు వెనకాడుతున్నారా..? లేదా అదృష్టం దక్కించుకోవడానికి మంచి ముహూర్తం కోసం వేచి చూస్తున్నారా? అనే అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ప్రతీసారి దరఖాస్తుల స్వీకరణ ముగుస్తున్న తరుణంలో అత్యధికంగా దరఖాస్తులు వస్తుంటాయి. ఇప్పుడు కూడా అదే తరహాలో వస్తాయా..? రూ.2లక్షలు ఉన్న ఫీజు రూ.3లక్షలకు పెంచినందుకు వెనకాడతారా? అనేది వేచి చూడాలి.

హనుమకొండ బస్‌స్టేషన్ కిటకిట

- ప్రయాణికులతో కిక్కిరిసిన ప్రాంగణం
- సెలవుల కారణంగా ఇళ్లకు బయలు దేరిన జనం



ప్రయాణికులతో రద్దీగా మారిన హనుమకొండ బస్‌స్టేషన్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా సెలవులు రావడంతో హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంగణం ప్రయాణికులతో శనివారం రద్దీ ఏర్పడింది. పలు రూట్లల్లో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక బస్‌స్టేషన్ ప్రాంగణంలో గంటల తరబడి పడిగాపులు కాశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ ప్రాంగణం వరద నీటిలో మునగడంతో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఉప్పల్ వరకే నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని కంఠాత్మకూరు మాటువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బస్సులను రూట్ మార్చి నడుపుతున్నట్లు తెలిపారు. కటాక్షపూర్ మత్తడి పెరగడంతో సాయంత్రం సమయంలో బస్సులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. హనుమకొండ బస్టేషన్ నుంచి ఇతర రూట్లల్లో అన్ని సర్వీస్‌లు నడిపిస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయాణికులు సహకరించాలని ఆర్ఎం పేర్కొన్నారు.

జయహో.. దీప్తి జీవాంజీ

అంతర్జాతీయ పోటీల్లో సిల్వర్ మెడల్ కైవసం



ఢిల్లీలో జరిగిన పోటీల్లో గెలిచి సిల్వర్ మెడల్ చూపుతున్న దీప్తి జీవాంజీ

పర్వతగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజీ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ - 2025 పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. శనివారం ఢిల్లీలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో 55.16 సెకన్ల సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేసి రాణించింది. ఈ సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలలో ఆర్డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రాంమోహన్ రావు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సైతం ఆనందం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

వరంగల్ పీడీఎం జడ్జి కందుకూరి పూజ

మామునూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వరంగల్ పీడీఎం జడ్జి కందుకూరి పూజ అన్నారు. వరంగల్ మామునూరులోని లెనిన్‌నగర్ కమ్యూనిటీ హాల్లో మామునూరు పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ హాజరై మాట్లాడారు. చెవిటి, మూగవారిని తక్కువ చేసి చూడరాదని, రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసబిలిటీస్ యాక్ట్ - 2016 ప్రకారం వారిని అవమానించడం చట్టరీత్యా నేరమని ఆమె స్పష్టం చేశారు. అదే విధంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికలపై జరిగే దాడులు, చట్టపరమైన రక్షణ చర్యలపై ఆమె అవగాహన కల్పించారు. మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.హరిక మాట్లాడుతూ.. బాల్యవివాహాలు నివారించాలన్నారు. మహిళలపై హింసను నిర్మూలించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అధికారి రజిని, మామునూరు సీఐ ఓ.రమేష్, ఎస్ఐలు టి.శ్రీకాంత్, ఎస్.కృష్ణవేణి, కోర్టు సిబ్బంది, కాలనీ వాసులు, మహిళలు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.





గుర్తింపు లేకుండా వైద్యం చేస్తున్న వారిపై కేసు

మడికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ, మెడికల్ కౌన్సిల్ గుర్తింపు, అర్హత లేకుండా రోగులకు వైద్యం చేస్తున్న వైద్యులపై శనివారం మడికొండ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం...ప్రభుత్వ, మెడికల్ కౌన్సిల్ గుర్తింపు, ఎంబీబీఎస్ అర్హత లేకుండా సెలైన్‌లు, ఇంజక్షన్లు ఇస్తూ రోగులకు స్వంత వైద్యం చేస్తున్నారని మడికొండలో ఏల్పుల జయరామ్, ఇ.భాగ్యలక్ష్మి నిర్వహిస్తున్న సాయిశ్రీ ప్రథమ చికిత్స కేంద్రం, అలాగే తాడెం రాజయ్య నిర్వహిస్తున్న శ్రీజ క్లీనిక్‌లను కొద్ది రోజుల కిందట విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ వారు తిరిగి అలాగే వైద్యం చేస్తున్నారంటూ, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ డాక్టర్ దండెం లాలయ్య కుమార్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డాక్టర్ లాలయ్య ఫిర్యాదు మేరకు జయరామ్, భాగ్యలక్ష్మి, రాజయ్యలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

తప్పిపోయిన బాలుర అప్పగింత


బాలురను తల్లికి అప్పగిస్తున్న ఇన్‌స్పెక్టర్ కిషన్, ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్

మడికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తప్పిపోయిన బాలురను పోలీసులు గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం... కడిపికొండకు చెందిన ఎండీ.షబానా.. తన ఇద్దరు కుమారులు అబ్దుల్ రహీమ్, అబ్దుల్ మక్సూద్ కనిపించడం లేదని శుక్రవారం అర్ధరాత్రి 100కు డయల్ చేసి చెప్పింది. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ కిషన్ ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్‌లతో రెండు బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. చివరకు బాలురిద్దరూ కడిపికొండలోని పాఠశాల వద్ద పడుకొని ఉన్నట్లు గుర్తించారు. శనివారం ఉదయం తల్లి షబానాకు బాలురిద్దరినీ అప్పగించామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఎవరు.. ఎక్కడ?!

- ఖరారైన జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు
- కులగణన సర్వే ప్రాతిపదికనే రిజర్వేషన్లు ఖరారు
- డ్రా పద్ధతి ద్వారా నిర్ణయించిన అధికారులు

హనుమకొండ/వరంగల్ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారయ్యాయి. రిజర్వేషన్ల వివరాలను శనివారం అధికారికంగా విడుదల చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తూ శుక్రవారం జీవో 9 జారీ అయిన మేరకు రెండు జిల్లాల్లో రిజర్వేషన్లను అధికారులు డ్రా పద్ధతి ద్వారా ఎంపిక చేశారు. కులగణన సర్వే ప్రకారం 68.2శాతం మేరకు పెరిగిన బీసీల జనాభా నిష్పత్తి ప్రాతిపదికగా జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఎస్సీ, ఎస్టీల విషయంలో 2011 జనాభాను ప్రాతిపదికగా తీసుకున్నారు.

హనుమకొండ జిల్లాలో..

హనుమకొండ జిల్లా పరిధిలోని 12 గ్రామీణ మండలాల పరిధిలోని మొత్తం 12 జడ్పీటీసీ, 12 ఎంపీపీ స్థానాలకు రిజర్వేషన్లను ఖరారు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలులోకి కావడంతో గతం లోకన్నా వారికి రిజర్వు అయిన స్థానాల సంఖ్య రెండు అదనంగా పెరిగాయి. గతంలో మూడు స్థానాలు ఉండగా, ప్రస్తుతం అయిదు అయ్యాయి. గతంలో ఎస్సీలకు 5 ఉండగా రెండుకు తగ్గింది. ఎస్టీలకు గతంలో లాగానే ఈసారి కూడా ఒక్క స్థానం కూడా దక్కలేదు. జనరల్ స్థానాలు నాలుగు యథాతథంగా ఉన్నాయి.

హనుమకొండ జిల్లా జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్ల వివరాలు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
ఆత్మకూరు	బీసీ జనరల్	బీసీ (జనరల్)
భీమదేవరపల్లి	బీసీ మహిళ	బీసీ (మహిళ)
దామెర	బీసీ జనరల్	బీసీ(మహిళ)
ధర్మసాగర్	జనరల్ మహిళ	జనరల్ (మహిళ)
ఎల్కతుర్తి	ఎస్సీ జనరల్	ఎస్సీ(మహిళ)
హసన్‌పర్తి	ఎస్సీ మహిళ	ఎస్సీ (జనరల్)
ఐనవోలు	ఎస్సీ జనరల్	ఎస్సీ (జనరల్)
కమలాపూర్	బీసీ మహిళ	బీసీ (జనరల్)
నడికుడ	జనరల్	జనరల్
పరకాల	జనరల్	జనరల్
శాయంపేట	బీసీ జనరల్	బీసీ (జనరల్)
వేలేరు	జనరల్ మహిళ	జనరల్ (మహిళ)


డ్రా తీస్తున్న హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్

డ్రా ద్వారా మహిళా రిజర్వేషన్లు ఖరారు

ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల్లో మహిళలకు సంబంధించిన రిజర్వేషన్లను కలెక్టర్ స్నేహ శబరీష్ డ్రా తీయడం ద్వారా ఖరారు చేశారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారుల సమక్షంలో కలెక్టర్ 12 ఎంపీపీ, 12 జడ్పీటీసీ స్థానాలల్లో మహిళా స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లను డ్రా తీశారు. ముందుగా ఎంపీపీ స్థానాల రిజర్వేషన్ల డ్రా తీయగా, అనంతరం జడ్పీటీసీ స్థానాల డ్రా తీశారు. రిజర్వేషన్ల ప్రకటన, మహిళా రిజర్వేషన్ స్థానాలకు డ్రా ప్రక్రియ మొత్తం వీడియో తీశారు. ఈ సందర్భంగా జడ్పీసీఈవో రవి, డీఆర్‌డీవో మేన శ్రీను, డీటీవో శ్రీనివాస్ కుమార్, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈవీ శ్రీనివాస్‌రావు, కొలను సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నిశాంత్, రజనీకాంత్, శ్యామ్ సుందర్, కొట్టే ఏసోబు, ప్రవీణ్ కుమార్, నేహాల్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఎంపీటీసీ, వార్డుల రిజర్వేషన్లు ఖరారు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా పరిధిలోని గ్రామ పంచాయతీల వారీగా సర్పంచ్, ఎంపీటీసీ, వార్డులకు రిజర్వేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అధికారులు ఖరారు చేశారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో 12 మండలాలకు సంబంధించి 210 సర్పంచ్, 129 ఎంపీటీసీ స్థానాలకు సంబంధించి రిజర్వేషన్లను ప్రకటించి, ఇందులో మహిళా రిజర్వేషన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులు, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డీఆర్‌డీవో మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, జిల్లా ఖజానా శాఖ అధికారి శ్రీనివాస్‌కుమార్, ఆయా మండలాల ఎంపీడీవోల సమక్షంలో హనుమకొండ ఆర్డీవో రాథోడ్ రమేష్ ఖరారు చేశారు. అదే విధంగా జిల్లాలో మొత్తం 1,986 వార్డు స్థానాల రిజర్వేషన్లను ఎంపీడీవోలు ఖరారు చేశారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్ జిల్లాలోని జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు అధికారులు రిజర్వేషన్లను కేటాయించారు. శనివారం వరంగల్ కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిన 11 ఎంపీపీ, 11 జడ్పీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు. అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రామిరెడ్డి ఆధ్వర్యంలో 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు, సాంఘిక ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కులగణన (ఎస్ఈఈఈపీసీ) ప్రకారం బీసీ రిజర్వేషన్ నిర్ణయించారు. జిల్లాలో మొత్తం 11 జడ్పీటీసీ స్థానాలకు ఎస్సీలకు 2 స్థానాలు, ఎస్టీలకు 2 స్థానాలు, బీసీలకు 5 స్థానాలు, జనరల్ 2 స్థానాలు కేటాయించారు. వీటిలో 5 స్థానాలను మహిళలకు కేటాయించారు. ఇక 11 ఎంపీపీ స్థానాలకు గాను ఎస్సీలకు 2 స్థానాలను, ఎస్టీ 2, బీసీలకు 5, జనరల్ స్థానాలు 2 కేటాయించారు. వీటిలో సైతం 5 స్థానాలను మహిళలకు కేటాయించినట్లు అదనపు కలెక్టర్ సంధ్యారాణి పేర్కొన్నారు. సంబంధిత రిజర్వేషన్ స్థానాల కేటాయింపు వివరాలను గెజిట్‌లో ప్రచురిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మొదలైన సందడి

జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్లు ఖరారు కావడంతో గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలైంది. రిజర్వేషన్లపై ఉత్కంఠ తొలగడంతో అన్ని పార్టీల ఆశావహులు ఎన్నికల్లో పోటీకి సన్నద్ధం అవుతున్నారు. ఏ స్థానం ఏ వర్గానికి రిజర్వు అయింది, జనరల్, మహిళల స్థానాల విషయంలో స్పష్టత రావడంతో రాజకీయ పార్టీలు కూడా అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారిస్తున్నాయి. ఆశావహులు కూడా తమ గాడ్‌ఫాదర్లను ఆశ్రయించి ప్రసన్నం చేసుకునే ప్రయత్నాలు అప్పుడే మొదలు పెట్టారు. ఇంకా కొన్ని గంటల్లో ఎన్నికల షెడ్యూల్ జారీకానున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం క్రమంగా వేడెక్కుతున్నది. ప్రభుత్వం తొలుత జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికలు నిర్వహించాలన్న నిర్ణయానికి రావడంతో ప్రాదేశిక ఎన్నికలపై దృష్టి పెట్టిన ఆశావహులు ఆ దిశగా పావులు కదడం మొదలు పెట్టారు. ఆశావహుల్లో చాలామంది ఇప్పటికే గ్రామాల్లో పరోక్షంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ జారీ అయిన తర్వాత ఇది మరింత జోరందుకోనున్నది. అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకుల్లో ప్రాదేశిక ఎన్నికల జోష్ అప్పుడే కనిపిస్తోంది. ఈ పార్టీ నేతల్లోనే పోటీ తీవ్రంగా ఉండనున్నది. ఎమ్మెల్యేలు రిజర్వేషన్ల వివరాలను తెప్పించుకొని అభ్యర్థుల ఎంపిక విషయంలో స్పష్టతకు రావడానికి కసరత్తు చేస్తున్నారు. ముఖ్యంగా బీసీ సీట్లు పెరిగినందు వల్ల వారిలో గెలుపు గుర్రాలను గుర్తించే పనిలో పడ్డారు. ఎమ్మెల్యేలు ఈ పాటికే ఆశావహుల్లో గెలుపు సత్తా కలిగిన నేతల వివరాలను సేకరించి పెట్టుకున్నట్టు తెలిసింది.

19న విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు

వరంగల్ కార్పొరేషన్/వడ్డెపల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లా విశ్రాంత పోలీసు అధికారుల సంఘం ఎన్నికలు అక్టోబరు 19న నిర్వహించనున్నట్టు ఎన్నికల నిర్వహణ అధికారులు ఆర్.బుచ్చయ్య, జి.నర్సయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికలు హనుమకొండ ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్‌లోని విశ్రాంత పోలీసు అధికారుల సంఘం కార్యాలయంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. అక్టోబరు 4న నామినేషన్లు, 5న నామినేషన్ల పరిశీలన, జాబితా ప్రకటన, 7వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు. 19న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎన్నికల ప్రక్రియతో పాటు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన, ఎన్నికైన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేస్తారని వారు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న విశ్రాంత పోలీసు అధికారులు, అర్హులైన సభ్యులు ఎన్నికల ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎన్నికల అధికారులు తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

పలువురికి గాయాలు

మడికొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటోను ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పలువురికి గాయాలైన ఘటన శనివారం మడికొండలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కాజీపేట మండలం కడిపికొండ రాజీవ్ గృహకల్పకు చెందిన ఆటోడ్రైవర్ ఎం.డి.రబ్బానీ తన ఆటోలో కొందరు ప్రయాణికులను తీసుకుని మడికొండ పోలీస్‌స్టేషన్‌కు వెళ్తున్నాడు. ఈక్రమంలో స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ దాటగానే ఆటో వీల్ ఊడిపోయి ఆగిపోయింది. అదే సమయంలో వెనుకాలే వస్తున్న ఆర్టీసీ బస్సు ఆటోను ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న డ్రైవర్‌తో పాటు మరి కొందరికి గాయాలయ్యాయి. స్థానికులు వారిని 108లో ఆస్పత్రికి తరలించారు.

విద్యుత్ పనులను వేగవంతం చేయాలి

- వీసీలో ఆదేశించిన సీఎండీ వరుణ్‌రెడ్డి



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

రాంనగర్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యలు ఉంటే తెలియజేసే ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్ పనులను వేగవంతం చేయాలని టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి 16 సర్కిళ్ల విద్యుత్ అధికారులను ఆదేశించారు. హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్ భవన్ నుంచి శనివారం ఆయా సర్కిళ్ల ఎస్ఈ, డీఈ, డీఈ టెక్నికల్, డీఈ యంఆర్‌టీ, ఎస్‌ఏలతో సీఎండీ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ఫాల్ట్ ప్యాసెజ్ ఇండికేటర్ ద్వారా సమస్య ఎక్కడ ఉందో తెలుసుకొని పునరుద్ధరణ పనులను వేగవంతం చేయవచ్చన్నారు. 11 కేవీ ఫీడర్‌లను వేరు చేయడం ద్వారా ఫీడర్‌లోని అంతరాయాలను తగ్గించవచ్చన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను డిజిటలైజేషన్ చేయడం ద్వారా ఎంత లోడ్ పడుతుందో సులువుగా తెలుసుకోవచ్చని, తద్వారా ట్రాన్స్‌ఫార్మర్లపై లోడు భారం పడకుండా తగిన చర్యలు తీసుకోవచ్చన్నారు. ఆటోమేటిక్ రీడింగ్ తీసుకునే హెచ్‌టీ సర్వీసులకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలన్నారు. రియల్ టైం ఫీడర్ మానిటరింగ్ సిస్టం పనుల పురోగతిపై చర్చిస్తూ సబ్ స్టేషన్‌లను స్కాడాకు అనుసంధానించడం ద్వారా విద్యుత్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని తెలుసుకొని సత్వరమే సమస్యను పరిష్కరించవచ్చన్నారు. రెవెన్యూ కలెక్షన్‌లను 100 శాతం వసూళ్ల చేయాలని ఆదేశించారు. వ్యవసాయ సర్వీసుల మంజూరును వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.మోహన్‌రావు, వి.తిరుపతిరెడ్డి, టి.మధుసూదన్, సి.ప్రభాకర్, సీఈలు సదరల్‌లాల్, అశోక్, వెంకటరమణ, సీజీఎం చరణ్‌దాసు తదితరులు పాల్గొన్నారు.

కట్ర్యాలలో కొండచిలువ కలకలం


చెరువులో లభ్యమైన కొండచిలువ

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కట్ర్యాల గ్రామంలో మత్స్యకారుడి వలకు కొండచిలువ చిక్కడం కలకలం సృష్టించింది. శనివారం స్థానిక ఊర చెరువులో దేశబోయిన కుమార్ చేపల వలను తీస్తుండగా అందులో కొండచిలువ చిక్కుకుంది. రాత్రి చెరువులో వల వేసి, ఉదయం తీయడం మత్స్యకారులు రోజువారీగా చేస్తుంటారు. ఈ తరుణంలోనే వలను తీస్తుండగా అప్పటికే వలలో చిక్కుకున్న 10 ఫీట్ల కొండ చిలువ ఊపిరి ఆడక చనిపోయింది. దీంతో దానిని మత్స్యకారుడు వెలికి తీశాడు. చనిపోయిన కొండ చిలువను చూసేందుకు స్థానికులు భారీగా తరలివచ్చారు.

కిడ్నీలోని 1,820 రాళ్ల తొలగింపు

- క్లిష్టమైన శస్త్రచికిత్స విజయవంతం
- యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి


మాట్లాడుతున్న యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : అత్యంత క్లిష్టమైన అరుదైన కిడ్నీ శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసి ఒకే కిడ్నీ నుంచి 1,820 రాళ్లను తొలగించినట్లు హనుమకొండలోని శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్ వైద్యుడు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. జనగామ జిల్లా లింగాల గణపురం మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన చెందిన దినసరి కూలీ కడకండి పరశురాములు ఈనెల 23న కిడ్నీ నొప్పితో తమ ఆస్పత్రిలో చేరాడని తెలిపారు. ఈ కేసు డూప్లెక్స్ మొయిటీ (ఒకే కిడ్నీలో ద్వంద మూత్ర పిండం) కిడ్నీలో 1,820 రాళ్లు ఉన్నాయని నిర్ధారించి ఆ తరువాత మల్టీ ట్రాక్ పీసీఎన్ఎల్ అనే పద్ధతిలో ఒకే సిట్టింగ్‌లో మొత్తం రాళ్లను తొలగించినట్లు వెల్లడించారు. రోగి తమ వద్దకు రాక ముందు హనుమకొండ, హైదరాబాద్‌లాంటి నగరాల్లోని అనేక ఆస్పత్రులను సంప్రదించగా అత్యంత క్లిష్టమైన ఆపరేషన్ అని, రెండు నుంచి మూడుసార్లు ఆపరేషన్ చేయాల్సి వస్తుందని, అయినప్పటికీ రాళ్ల మొత్తం తొలగించే అవకాశం లేదని స్పష్టం చేశారని తెలిపారు. ఇవన్ని చేసేందుకు రూ.3.5లక్షలకు పైగా ఖర్చు అవుతుందని చెప్పడంతో రోగి భయభ్రాంతులకు గురైనట్లు తెలిపారు. ఆ తరువాత తమ ఆస్పత్రిని సంప్రదించగా ఆరోగ్యశ్రీలో ఉచితంగా కిడ్నీలోని 1,820 రాళ్లను తొలగించినట్లు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రోగిని 72 గంటలలోపు పూర్తి ఆరోగ్యంతో డిశ్చార్జ్ చేయగా రోగితోపాటు రోగి బంధువులు సంతృప్తి వ్యక్తం చేసినట్లు యూరాలజిస్టు డాక్టర్ రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మహిళ మెడలోని బంగారు గొలుసు చోరీ


సీసీ కెమెరాలో రికార్డు అయిన నిందితుడు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారి పోలీసు స్టేషన్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీలో ఓ మహిళ మెడలోని రెండు తులాల బంగారు గొలుసు ఎత్తుకుపోయిన ఘటన జరిగింది. శనివారం సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ తెలిపిన ప్రకారం... ఎక్సైజ్‌కాలనీకి చెందిన ఎం.సరస్వతి ఇంటి సమీపంలో ఉన్న కిరాణం షాపులో పని చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి పుట్టిన రోజు గిఫ్ట్‌ల కోసం వచ్చి వెళ్లాడని, పావుగంట తర్వాత ఆ వ్యక్తే మెస్‌డోర్ నుంచి వచ్చి సరస్వతి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు ఎత్తికెళ్లి ద్విచక్ర వాహనంపై పారిపోయినట్లు తెలిపారు. కాగా, బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రంజిత్‌కుమార్ తెలిపారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడి కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

వాకింగ్ చేయడానికి అనువుగా ఏర్పాట్లు చేయండి

- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్
- పూర్తిచేసిన స్మార్ట్‌సిటీ అభివృద్ధి పనుల పరిశీలన


వడ్డెపల్లిలో అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వడ్డెపల్లి బండ్‌పై వాకింగ్ చేయడానికి అనువుగా ఏర్పాట్లు చేయాలని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అన్నారు. స్మార్ట్‌సిటీ పనుల పరిశీలనలో భాగంగా శనివారం వడ్డెపల్లి, భద్రకాళి బండ్‌పై జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తర్వాత పోతననగర్ శ్మశానవాటికలో జరుగుతున్న పనులను పర్యవేక్షించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ స్మార్ట్‌సిటీ పథకంలో మిగిలిన పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వడ్డెపల్లి బండ్‌పై టైల్స్‌తో పాటు గ్రావెల్‌ను గుంతలలో నింపాలన్నారు. ఇన్‌చార్జి ఎస్ఈ మహేందర్, ఈఈ రవికుమార్, స్మార్ట్‌సిటీ పీఎంసీ ఆనందం పాల్గొన్నారు.

ప్రపంచ రేబిస్ దినోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రపంచ రేబిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లా డాగ్ బ్రీడర్స్ అసోసియేషన్, జిల్లా పశుసంవర్ధక శాఖ సంయుక్తాధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శనివారం జీడబ్ల్యూఎంసీ కార్యాలయంలో రేబిస్ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. రేబిస్ దినోత్సవం సందర్భంగా నివారణ అవగాహన కార్యక్రమంలో భాగంగా హనుమకొండ బాలసముద్రంలోని పెట్‌పార్క్‌లో ఆదివారం ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేయనున్నారు. పశువైద్యశాఖ జేడీ రాధాకృష్ణ, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, వెటర్నరీ అధికారి గోపాల్‌రావుతోపాటు డాగ్ బ్రీడర్స్ పాల్గొన్నారు.

సాంకేతికపరమైన వృత్తి నైపుణ్యం కీలకం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- ఐటీఐ కళాశాలలో ఏటీసీ సెంటర్ ప్రారంభం


ఏటీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సాంకేతికపరమైన వృత్తి నైపుణ్యం జీవన ప్రమాణాలకు చాలా కీలకమని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రూ.22కోట్లతో ములుగురోడ్‌లోని ఐటీఐ కళాశాలలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్(ఏటీసీ)ను శనివారం వరంగల్ ఎంపీ కడియం కావ్యతోకలిసి ఎమ్మెల్యే నాయిని ప్రారంభించారు. ఈసందర్భంగా వర్చువల్‌లో రాష్ట్రంలోని 65 సెంటర్లను సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడగా ఎమ్మెల్యే, ఎంపీ వీక్షించారు. కార్యక్రమంలో వరంగల్ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ చందర్, హనుమకొండ, కాజీపేట ఐటీఐ కళాశాలల ప్రిన్సిపాళ్లు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బలాన్నిచ్చే బతుకమ్మ ఫలహారాలు

- ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలకు నిలయం
- తొమ్మిది రోజులు తొమ్మిది రకాలు
- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

వర్ధన్నపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆడపడుచుల్లో బతుకమ్మ పండుగా ఆరోగ్యకాంతులను వెలిగిస్తోంది. బతుకమ్మ ఆడిన తర్వాత సద్ది పేరుతో 'ఇచ్చినమ్మ వాయినం... పుచ్చుకుంటినమ్మ వాయినం' అంటూ అతివలు ఫలహారాలను పరస్పరం ఇచ్చిపుచ్చుకుంటారు. వీటిలో అనేక పోషక విలువలు ఉన్నాయంటున్నారు వైద్యులు. ఆటపాటలు, మానసికోల్లాసమే కాదు శరీరానికి కావాల్సిన అనేక పోషకాలను ఫలహారాల రూపంలో బతుకమ్మ అందిస్తోంది.



బతుకమ్మ సద్దిలో ఐరన్

భారతీయ మహిళల్లో ఐరన్ లోపం కనిపిస్తోందని నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రభావం పిల్లల్లోనూ ఉంటోంది. బతుకమ్మ వేడుకల్లో తయారు చేసుకునే సద్దిలో ఐరన్ శాతం అధికంగా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. తొమ్మిది రోజులు తొమ్మిది రకాల ఫలహారాలను తయారు చేస్తారు. ఇందులో సత్తుపిండి, సద్ద ముద్దలు, నవ్వులు, కొబ్బరి, పల్లిపొడి లేదా ముద్దలు తదితర ఫలహారాలు ఉంటాయి. ఇవన్నీ పండుగ సమయానికి చేతికి వచ్చే చిరుధాన్యాలు. వీటిని తింటే ఆరోగ్యకరమని పెద్దలు చెబుతున్నారు.



నువ్వుల ముద్దలు

బతుకమ్మ పండుగలో నువ్వులు ప్రాధాన్యం అంతాఇంతా కాదు. వీటితో పొడి చేస్తారు. నవ్వుల్లో ఎమినోయాసిడ్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరానికి చాలా ముఖ్యమైనవి. జింక్, కాల్షియం ఎముకల దృఢత్వాన్ని పెంచుతుంది.

పెసర ముద్దలు

పెసళ్లను ఉడకబెట్టి బెల్లం కలిపి ముద్దలుగా తయారు చేస్తారు. ఇవి జీర్ణశక్తిని పెంచుతాయి. జీర్ణ సంబంధిత వ్యాధులనూ తగ్గిస్తాయి.

కొబ్బరి పొడి, పెరుగన్నం, పులిహోర

కొబ్బరిలో ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. మహిళల ఆరోగ్యానికి చాలా ఉపయోగపడుతుంది. పెరుగన్నం, పులిహోర ఇటీవల సద్దిగా ఇస్తున్నారు. పెరుగన్నంలో పల్లీలు, వివిధ రకాల ధాన్యాలు కలుపుతున్నారు. పులిహోర కూడా ప్రసాదంగా వాడుతున్నారు. చింతపండు గుజ్జుల్లో విటమిన్ సి అధికంగా ఉంటుంది. పెరుగులో పోషక విలువలు మెండు. అన్నం కలిపి కమ్మనైన నైవేద్యాన్ని సమర్పిస్తారు. ఇందులో ప్రోటీన్, కాల్షియం, రిబోఫ్లా విటమిన్, విటమిన్ బి-6, బి12, వంటి పోషకాలు అధికంగా ఉంటాయి. కొవ్వు తక్కువగా ఉండే పెరుగులో లాక్టోబసిల్లై అధికంగా ఉంటుంది. అపెండిసైటీస్, డయేరియా, డిసెంట్రీ వంటి వ్యాధులకు కారణమయ్యే బాక్టీరియాను లాక్టిక్ యాసిడ్ నాశనం చేస్తుంది. పెరుగులో ఉండే విటమిన్ నిరోధక శక్తిని పెంచుతుంది.

సద్దుల్లో పోషకాలు

బతుకమ్మ ఉత్సవాలు వస్తే అందరికీ సద్ద ముద్దలు (సజ్జ ముద్దలు) గుర్తుకొస్తాయి. ఈ పేరుతోనే పెద్దబతుకమ్మ సద్దుల బతుకమ్మ అని పేరు వచ్చిందని చెబుతారు. సందె వేళలో చేసే బతుకమ్మ కాబట్టి సద్దుల బతుకమ్మ అంటారని మరో చరిత్ర. సజ్జలను పిండిగా పట్టించి బెల్లం కలిపి ముద్దలు చేస్తారు. కొందరు వీటికి నెయ్యి కూడా కలుపుతారు. వీటిలో పీచు పదార్థాలు ఎక్కువ. కార్బోహైడ్రేట్స్ తక్కువ. ప్రోటీన్లు, కాల్షియం అధికంగా ఉంటాయి. త్వరగా జీర్ణమవుతుంది. దీనికి బెల్లం కలపడంతో ఐరన్ శాతం పెరిగి మహిళల రుతుక్రమ సమస్య నివారణ, గొంతు నొప్పి తగ్గిస్తుందని వైద్యులు వివరిస్తున్నారు.

పల్లి పిండి

పల్లిపిండి శరీర ఎదుగుదలలో అత్యంత ప్రధానమైనది. అధిక ప్రోటీన్లతో పాటు రుచికరంగా ఉంటాయి. చాలామంది ఇష్టంగా తింటారు. దీనికి బెల్లం జోడించడంతో పోషకాలు లభిస్తాయి.

పోషకాలు పుష్కలం


డాక్టర్ బెతం నర్సింహస్వామి, వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్



బతుకమ్మ పండుగకు తయారు చేసే సత్తుపిండిలో వ్యాధి నిరోధక శక్తి పెంచే పోషకాలు ఉంటాయి. రుచికరంగా ఉండే సత్తుపిండి పిల్లలకు ప్రోటీన్లు అందిస్తాయి. కండరాల పటిష్ఠత, ఎముకల గట్టితనం, పిల్లల ఎదుగుదల... ఇలా అనేక ఉపయోగాలున్నాయి. సంప్రదాయ పిండి వంటలను ప్రతిఒక్కరూ తినాలి. బతుకమ్మ ఆరోగ్యాన్ని పంచే ప్రత్యేకమైన పండుగ.

జాతి వైరం విడిచి..

- పిల్లి పిల్లను సాకుతున్న తల్లి కోడి
- మాతృ ప్రేమను పంచుతున్న కోడి



నెక్కొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా జంతువుల మధ్య వైరం ఉండడం సహజం. ఆహారం మొదలు ప్రతీ విషయంలో ఒక జాతి జంతువులు మరో జాతి జంతువులతో పొట్లాటకు దిగుతుంటాయి. కోడి పిల్లలను పిల్లులు వెంటాడి, వేటాడి తింటుంటాయి. కానీ వరంగల్ జిల్లా నెక్కొండ మండలం బీసీ కాలనీకి చెందిన పొట్లపల్లి వీరస్వామి ఇంట్లో ఉంటున్న పిల్లి తల్లి రెండు నెలల కిందట చనిపోయింది. అప్పటి నుంచి కోడి తన పిల్లలతో పాటు పిల్లి పిల్లను సాకుతోంది. రాత్రి సమయంలో పిల్లి కోడి వద్దనే నిద్రిస్తోంది. జాతి వైరం మరిచి పిల్లి పిల్లను తల్లి కోడి సాకుతూ మాతృ ప్రేమను చాటుకుంటోంది. ఈ విషయంపై స్థానికులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్క ఓటుకు రిజర్వేషన్ కేటాయింపు..!

ఆశాలపల్లి గ్రామంలో ఎస్సీకి రిజర్వు

సంగెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆ గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గం నుంచి ఒక్కరు మాత్రమే ఉన్నారు. పోటీ చేద్దామన్నా ప్రత్యర్థి కూడా ఆ సామాజిక వర్గం నుంచి లేకపోవడం గమనార్హం. వరంగల్ జిల్లా సంగెం మండలంలోని ఆశాలపెల్లి గ్రామం సర్పంచ్ రిజర్వేషన్ల కింద ఎస్టీ మహిళకు కేటాయించారు. కానీ, అక్కడ ఎస్టీ ఓటర్లు ఒక కుటుంబం మాత్రమే ఉంది. మన్నెం మల్లమ్మ అనే మహిళకు ఇక్కడి ఓటు హక్కు కలిగి ఉండగా, భర్త వెంకటయ్య ఇటీవల చెరువులో పడి మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా, వారి వివాహాలు సైతం చేశారు. మల్లమ్మ కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఇక దీనిపై గ్రామస్థులు సైతం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఒక్క ఓటు మాత్రమే ఉన్న వర్గానికి ఎలా రిజర్వేషన్ కేటాయిస్తారని, దీన్ని రద్దు చేయాలని కోరారు. ఇక ఇదే మండలంలోని వంజరపల్లి గ్రామంలో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు ఎవ్వరూ లేకపోయినా, సర్పంచ్ స్థానాన్ని ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. దీంతో గ్రామస్థులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

పండుగల వేళ సమ్మెలో టైలర్ వర్కర్లు

- కూలీ రేట్లు పెంచాలని డిమాండ్
- డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు వినతి

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ, దసరా పండుగల ముందు హనుమకొండలోని టైలర్ వర్కర్లు శనివారం సమ్మె చేపట్టారు. రెండేళ్లకోసారి వర్కర్ల కూలీ రేట్లను పెంచడం ఆనవాయితీగా వస్తుండగా ఈ యేడు టైలర్ షాపుల యాజమాన్యాలు వర్కర్ల కూలీ రేట్లను పెంచలేదు. కూలీరేట్లను పెంచాల్సిందిగా నాలుగు నెలల నుంచి యాజమాన్యాలను వేడుకుంటున్నా పెంచడం లేదని వర్కర్లు డిప్యూటీ లేబర్ కమిషనర్‌ను ఆశ్రయించారు. డిప్యూటీ కమిషనర్ ఇరు వర్గాలతో ఉమ్మడి సమావేశం ఏర్పాటుచేసి సయోధ్య చేకూర్చే ప్రయత్నం చేసినా ఫలించలేదు.

కాగా, అన్ని పండుగలకంటే బతుకమ్మ, దసరా పండుగలకు అందరు కొత్త దుస్తులు ధరించడం సంప్రదాయంగా వస్తోంది. టైలర్లకు కూడా ఈ పండుగల సమయంలో విపరీతమైన గిరాకీ ఉంటుంది. టైలర్ షాపుల యాజమాన్యాలు షర్టుకు రూ.700, ప్యాంటుకు రూ.900 తీసుకుంటూ తమకు మాత్రం షర్టుకు రూ.174, ప్యాంటుకు రూ.280 మాత్రమే చెల్లిస్తున్నారని వర్కర్లు వాపోతున్నారు. రెండేళ్ల కిందట షర్టుకు రూ.19, ప్యాంటుకు రూ.31 పెంచామని, ఈ యేడు కూడా అదే రేట్లను మళ్లీ పెంచుతామని చెబుతున్నా.. వర్కర్లు వినిపించుకోవడం లేదని యజమానులు తెలిపారు. తమకు కూడా మెటీరియల్‌కు, షాపుల అద్దెలు పెరిగాయని, గిరాకీ కూడా తక్కువైందని అంటున్నారు. రేట్లు ఎక్కువగా పెంచితే తమకు గిట్టుబాటు కాదని చెబుతున్నారు. ఇరువర్గాలకు ఆమోదయోగ్యంగా ఉండే విధంగా కూర్చొని మాట్లాడుకుందామని వర్కర్లకు విజ్ఞప్తి చేస్తున్నారు. సమ్మె వల్ల యాజమాన్యాలు, వర్కర్లు ఇరు వర్గాలు నష్టపోతారని, వర్కర్లు గుర్తించాలని యాజమాన్యాలు కోరుతున్నాయి.



డిప్యూటీ లేబర్ కమిషనర్ కార్యాలయం ఎదుట గుమికూడిన టైలర్ వర్కర్లు

పర్యాటక ప్రాంతాలకు నెలవు.. వరంగల్

- ఆర్‌డీవో రమేష్ రాథోడ్
- హరిత కాకతీయలో పర్యాటక ఉత్సవాలు

బాలసముద్రం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చరిత్రను, సంస్కృతిని తెలిపే గొప్ప పర్యాటక ప్రాంతాలు ఉన్న ప్రదేశం ఉమ్మడి వరంగల్ జిల్లా అని హనుమకొండ ఆర్డీవో రమేష్ రాథోడ్ అన్నారు. సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హరిత కాకతీయలో సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి ఎం.శివాజీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమంలో రమేష్ రాథోడ్ మాట్లాడుతూ.. జిల్లా పర్యాటక రంగం అభివృద్ధికి సూచికగా ఎదుగుతుందని అన్నారు. రామప్ప, లక్నవరం చెరువులు, మేడారం, వేయిస్తంభాల ఆలయాలు, ఖిలా వరంగల్ లాంటి పర్యాటక ప్రాంతాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయని అన్నారు. జిల్లా పర్యాటక శాఖ అధికారి శివాజీ మాట్లాడుతూ.. టూరిజం పొటెన్షియల్ ఉన్న ప్రాంతాలను గుర్తించి అభివృద్ధిపర్చడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని అన్నారు. పర్యాటక ఆకర్షణలు పెంచడానికి, దేశ విదేశీ పర్యాటకులను వరంగల్‌కు రప్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. మిస్‌వరల్డ్‌లో పాల్గొన్న సుందరీమణులను నగరానికి తీసుకు రావడం వల్ల జిల్లా కీర్తి విశ్వవ్యాప్తమైందని అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు పర్యాటక రంగంపై నిర్వహించిన వ్యాస రచన, చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందజేశారు.



ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఆర్‌డీవో రమేష్ రాథోడ్



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థినులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

పర్యాటక ఉత్సవాల్లో భాగంగా తాడూరి రేణుక శిష్య బృందం నిర్వహించిన నృత్యాలు అలరించాయి. పర్యాటక ప్రాంతాలను తెలిపే గీతంతోపాటు బతుకమ్మ ప్రత్యేక గీతానికి కళా బృందం చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రముఖ సామాజిక వేత్త నిమ్మల శ్రీనివాస్ వాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారులు హరిత కాకతీయ మేనేజర్ శ్రీధర్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, ట్రెజరీ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్, కుమారస్వామి, ధన్‌రాజ్, కుసుమ సూర్యకిరణ్, లోకేశ్వర్, చిరంజీవి, శరత్, సతీష్, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ప్రసాదం.. సీతాఫలం..

- ఒత్తిడిని తగ్గించి, నిద్రను మెరుగుపరిచే ఔషధం
- రోగ నిరోధక శక్తిని పెంచే మధురఫలం
- పేదోడి ఆపిల్‌గా దీనికి పేరు..
- నగరంలో ఇప్పటికే ప్రారంభమైన అమ్మకాలు



గ్రామాల నుంచి అమ్మకానికి తీసుకొచ్చిన సీతాఫలాలు

మామునూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి మనకు అందించే అద్భుతమైన ప్రసాదం పండ్లు. ఆరోగ్యానికి అంతకు మంచిన ఔషధాలు ఉండవు అంటే అతిశయోక్తి కాదు. సీజన్ వారీగా లభించే పండ్లలో సీతాఫలం ఒకటి. వాటికి అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. బాగా పండిన సీతాఫలం లోపల తియ్యని గుజ్జుతో నల్లని విత్తనాలతో మధురమైన రుచిని కలిగి ఉంటుంది. సహజంగా పండిన సీతాఫలాల రుచి గురించి ఎంత చెప్పినా తక్కువే.. శీతాకాలంలో మాత్రమే కాసే సీతాఫలం కోసం ఏడాది మెత్తం ఎదురు చూసే వారున్నారు. మామిడి పండ్లకు ఏమాత్రం తీసిపోని క్రేజ్ సీతాఫలాలది. కేవలం రుచికే కాదు.. ఆరోగ్యాన్ని చేకూర్చడంలో కూడా సీతాఫలం ఓ మెట్టు పైనే ఉంటుంది. సీతాఫలం తినడం వల్ల రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణక్రియ మెరుగుపడుతుంది. చర్మం మెరుస్తుంది. గుండె ఆరోగ్యంగా ఉండడానికి దోహదపడుతుంది.

ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు..

పేదోడికి అందుబాటులో ఉండి ఉత్తమ పోషక విలువలు కలిగిన ఫలం సీతాఫలం. దీనికి పేదోడి ఆపిల్ అనికుడా పేరొచ్చింది. గుండె ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో ఇందులోని పోషకాలు సహాయపడుతాయి. దీనిలో ఉండే బి6 విటమిన్‌తో శ్వాసకోశ సమస్యలనుంచి ఉపశమనం పొందవచ్చు. ఎసిడిటీని తగ్గిస్తుంది. వీటిలో కెరొటినాయిడ్స్, విటమిన్ సీ, యాంటీ ఆక్సిడెంట్లు, వనాయిడ్స్ ఎక్కువ మొత్తంలో ఉండటంతో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. అంతేకాక చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. జ్వరం ఉన్నవారికి ఇవి మేలు చేస్తాయి. అధిక బరువుతో బాధపడేవారు రోజూ ఒక సీతాఫలాన్ని తినడంద్వారా త్వరగా సన్నబడుతారని నిపుణులు చెపుతున్నారు.

ధర తక్కువే..

శీతాకాలంలో మాత్రమే లభించే సీతాఫలాలను గ్రామీణ ప్రాంతాలనుంచి తీసుకువచ్చి పట్టణ శివారు ప్రాంతాల్లో అమ్ముతుంటారు. ఇంకా సీజన్ ఆరంభం కాకముందే ఈ ఏడాది సీతాఫలం అమ్మకాలు చాలా తక్కువ ధరలకే లభిస్తున్నాయి. పట్టణ ప్రజలు, వీటి పోషక విలువలు తెలిసిన వారు ఇప్పటికే కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో సీతాఫలం రేటు రూ.15 నుంచి రూ.20 వరుకు అమ్ముతున్నారు. కిలోల చొప్పున కేజీకి రూ. 70 నుంచి రూ.85 రూపాయల వరకు అమ్ముతున్నారు. మిగతా పండ్లతో పోలిస్తే చాలా తక్కువ ధరకే లభించడం విశేషం.



పోషకాలు పుష్కలం..

సీతాఫలాల్లో పోషకాలు అధికంగా ఉంటాయి. వీటిని ఇష్టపడనివారు ఉండరు. ఇందులో ఉండే విటమిన్-సీ, విటమిన్ బి6, ఫైబర్ కాల్షియం, ఆంటీ ఆక్సిడెంట్లు, పీచు పదర్థాలు, ఖనిజ లవణాలు, మెగ్నీషియం, మాంసంకృత్తులు పుష్కలంగా ఉంటాయి. ఇవి తెల్ల రక్తకణాలను ఉత్పత్తి చేస్తాయి. జీర్ణ సంబంధ సమస్యలు తొలగించడంలో సహాయపడుతాయి.

29వ తేదీనే సద్దుల బతుకమ్మ

- శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ సంప్రదాయ పర్వం
- పండితుల ఏకాభిప్రాయం



మాట్లాడుతున్న సుదర్శనాచార్యులు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సద్దుల బతుకమ్మ విషయంలో గందరగోళం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నెల 29వ తేదీనే జరుపుకోవాలని కొందరు, 30న జరుపుకోవాలని మరికొందరు పండితులు ఏకాభిప్రాయానికి రాని నేపథ్యంలో శనివారం అనేక మంది ప్రముఖులు ఈ విషయంపై స్పందించారు. ప్రధానంగా ఈ ప్రాంతంలో ప్రముఖ జ్యోతిష్య, వాస్తు పండితుడిగా చెలామణిలో ఉన్న ఊకల్ నాగేంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు ప్రతిస్పందించారు. శాస్త్ర నియమం కాదు.. బతుకమ్మ విషయంలో సంప్రదాయ పర్వం కాబట్టి మెజార్టీ మహిళల అభిప్రాయమే ప్రధానమన్నారు. కచ్చితంగా సద్దుల బతుకమ్మను 29న సోమవారం జరుపుకోవడం ప్రాంతీయ ఆచారమని ఆయన పేర్కొన్నారు. బతుకమ్మ విషయంలో తిథి వార నక్షత్రం, యోగం, కరుణం లాంటి నియామకాలు ఉండవన్నారు. 6వ రోజు అర్రెంగా భావిస్తు బతుకమ్మను కొంతమంది ఆడరని, అదే క్రమంలో 9వ రోజు నిమజ్జనోత్సవం జరిగి తీరాలన్నది ఆయన స్పష్టం చేశారు. బతుకమ్మ విషయంలో ఎవరెన్ని చెప్పినా 9వ రోజు నిమజ్జనం చేయడం సనాతన సంప్రదాయమని ఆయన పేర్కొన్నారు.

అలాగే ఎవరెన్ని చెప్పినా సంప్రదాయ నియమం ప్రకారం 29వ తేదీనే మహిళలు సద్దులు జరుపుకొని తీరాలని పండితులు ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వరంగల్ జిల్లా బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు ఉదయమర్రి కృష్ణమూర్తి, వరంగల్‌లోని ఆకారపు గుడి ప్రధాన అర్చకుడు జిల్లా బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి లంకా శివకుమార్, రాష్ట్ర పురోహిత సంఘం అధ్యక్షులు తాండ్ర నాగేంద్రశర్మ, మరో ప్రముఖ వేద పండితుడు గ్రేటర్ హైదరాబాద్ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గన్ను సత్యనారాయణశర్మ, హనుమకొండలోని పద్మాక్షి ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకరశర్మ, ఐనవోలు ఆలయ వేద పండితుడు మధుశర్మ, వరంగల్ నగరంలోని ప్రముఖ జ్యోతిష్యకారుడు సుమన్ శర్మ, జనగామలోని శ్రీ వెంకటేశ్వర ఆలయ వ్యవస్థాపకుడు, సిద్ధాంతి సంపత్‌కుమారకృష్ణమాచార్యులు లాంటి అనేక మంది ప్రముఖులు బతుకమ్మ విషయంలో ఎలాంటి వివాదాలకు తావులేదన్నారు. సోషల్ మీడియా ద్వారా ఎవరికి వారు సద్దుల బతుకమ్మ విషయంలో 29వ తేదీన జరుపుకోవాలని ప్రజలకు తెలియజెప్పారు. ఆదివారం హనుమకొండలోని బ్రాహ్మణ భవన్‌లో పండితులంతా సమావేశమై ప్రజలకు స్పష్టత ఇచ్చేందుకు సమావేశం అవుతున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, పరకాల పట్టణంలోని మునిసిపాలిటీ మెజార్టీ మహిళల, పండితుల అభిప్రాయం ప్రకారం 29న సద్దుల బతుకమ్మ జరుపుకోవాలని కమిషనర్ పేరిట మునిసిపల్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడటం గమనార్హం.

ఈనెల 30న సద్దుల బతుకమ్మ

ప్రభుత్వం అధికారికంగా ప్రకటన

హనుమకొండ (ఆంధ్రజ్యోతి) : సద్దుల బతుకమ్మను ఈనెల 30వ తేదీన జరుపుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.రామక్రిష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగా ప్రభుత్వం ప్రకటించింది తెలిసిందే. ఈ మేరకు ఈనెల 30న సద్దుల బతుకమ్మ పర్వదినమని ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఆ రోజు మహిళలు సద్దుల బతుకమ్మ జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేయాలని, తగిన భద్రత కల్పించాలని ఆ ఉత్తర్వుల్లో సీఎస్ పేర్కొన్నారు. కాగా, పండితులు, పంచాంగకర్తలు.. శాస్త్రం, సంప్రదాయం ప్రకారం ఈనెల 29నే సద్దుల బతుకమ్మను జరుపుకోవాలని సూచించగా, ప్రభుత్వం 30న సద్దులు అని ఉత్తర్వులు విడుదల చేయడం విశేషం.

కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం రాత్రి హనుమకొండ కలెక్టరేట్‌లో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ హాజరై బతుకమ్మకు బొట్టు పెట్టి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగినులు పాల్గొని బతుకమ్మ ఆడిపాడారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో వైభవంగా బతుకమ్మ పండుగను జరుపుకుంటారన్నారు. జిల్లాలోని మహిళలందరు ఈ సద్దుల బతుకమ్మ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటొరెడ్డి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి మేన శ్రీను, జిల్లా రెవెన్యూ అధికారి వై.వి గణేష్, ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ రాజేందర్, టీఎన్‌జీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి సోమయ్యతోపాటు పెద్ద సంఖ్యలో ఉద్యోగ సంఘా జేఏసీ నాయకులు, టీఎన్‌జీఓస్ నాయకులు పుల్లూరు వేణుగోపాల్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ వేడుకల్లో టీఎన్జీవో నాయకులు



హనుమకొండ కలెక్టరేట్‌లో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగినులు



బతుకమ్మ వేడుకల్లో ఫైర్ గన్ పేల్చుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్



మహిళా మోర్చా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు

శంభునిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శివనగర్ భక్త మార్కండేయ దేవాలయంలో శనివారం బతుకమ్మ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. 23వ డివిజన్ కార్పొరేటర్ ఆడెపు స్వప్న, బీజేపీ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. వేడుకలను నిర్వహించటం పట్ల మహిళా మోర్చా సభ్యులను అభినందించారు. ఈ వేడుకల్లో వరంగల్ జిల్లా మహిళా మోర్చా ప్రతినిధులు మార్త ఉషారాణి, బండి సుజాత, టేకుమట్ల రేణుక, బైరి రాధిక, రాజేశ్వరి, కుసుమ శైలజ, అయితం స్వరూప, నిహారిక, స్రవంతి, సుమతి, సాగరిక, ఉమా, లత పాల్గొనగా బీజేపీ నాయకులు మహమ్మద్ రఫీ, బైరి శ్యామ్‌సుందర్, రత్నం సతీష్ షా, కూచన క్రాంతి, రమేష్ తదితరులు పోటీలను పర్యవేక్షించారు.



శివనగర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పెద్దపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా వనజ

గ్రూపు1 విజేతకు ఉత్తర్వులు అందించిన సీఎం రేవంత్‌రెడ్డి



సీఎం చేతుల మీదుగా ఆర్డర్ కాపీ అందుకుంటున్న బానోతు వనజ

గిర్మాజీపేట,సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ కృష్ణకాలనీ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల సివిక్స్ లెక్చరర్ బానోతు వనజ పెద్దపల్లి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా నియమితుయ్యారు. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం లింగాపురం గ్రామానికి చెందిన బానోతు వనజ ఇటీవల వెలువడిన గ్రూపు1 ఫలితాల్లో 38వ ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆమెను పెద్దపల్లి జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా నియమిస్తూ శనివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్డర్ కాపీని అందజేశారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ఎస్ఎస్‌సి, కాకతీయ దూర విద్యలో బీఏ, ఉస్మానియాలో ఎంఏ పూర్తి చేసిన వనజ గత మార్చిలో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ఇక్కడికి వచ్చారు. పెద్దపల్లి డిప్యూటీ కలెక్టర్‌గా నియామకం కావడంపై కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శరద్భుతి హర్షం వ్యక్తం చేశారు.

నేడు ఆర్ఎస్ఎస్ వందేళ్ల ఉత్సవం

రంగశాయిపేట జనతా పరపతి సంఘంలో వేడుకలు

శంభునిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జాతీయవాద, సమాజ సేవా సంస్థ రాష్ట్రీయ స్వయం సేవక్ (ఆర్ఎస్ఎస్) వందేళ్ళ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఆదివారం విజయదశమి ఉత్సవం నిర్వహించనున్నట్లు రంగశాయిపేట యూత్ ఫోర్స్ (ఆర్‌వైఎఫ్) బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం రంగశాయిపేట జనతా పరపతి సంఘంలో ఉత్సవాలు నిర్వహిసామని, ముఖ్య అతిథిగా సీనియర్ జర్నలిస్టు శెంకేసి శంకర్‌రావు, ముఖ్య వక్తగా హిందూ వాహిని అఖిల భారతీయ సహ సంఘటన మంత్రి దేవేందర్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమం అనంతరం గ్రామ బస్తీలో పదచలనం (రూట్ మార్చ్) నిర్వహిస్తామని, జాతీయవాదులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని ఆర్‌వైఎఫ్ బాధ్యులు ఆ ప్రకటనలో కోరారు.

ఉద్యోగులకు విరమణ సహజం

వరంగల్‌సిటీ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి విరమణ సహజమని మార్కెటింగ్‌శాఖ జాయింట్ డైరెక్టర్(జేడీఎం) ఉప్పుల శ్రీనివాస్ అన్నారు. ఏనుమాముల మార్కెట్లో పనిచేసిన ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల ఉద్యోగ విరమణ కార్యక్రమం శనివారం వరంగల్ నాయుడు హోటల్‌లో ఘనంగా నిర్వహించారు. జేడీఎంతో పాటు డీడీఎం పద్మావతి, డీఎం సురేఖ, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవిందర్‌రెడ్డి, కాటన్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు చింతపల్లి వీరారావు, చాంబర్ మాజీ అధ్యక్షుడు కటకం పెంటయ్య, మార్కెట్ ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు జన్ను భాస్కర్, ఓయాసిస్ విద్యాసంస్థల చైర్మన్ పరంజ్యోతి హాజరై నిర్మలను సత్కరించారు.

త్యాగధనుడు కొండా లక్ష్మణ్ బాపూజీ

● జయంతి వేడుకల్లో కొనియాడిన నేతలు

వరంగల్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ 23వ డివిజన్ కొత్తవాడ జంక్షన్ వద్ద అఖిల భారత పద్మశాలి సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్ ఆధ్వర్యంలో కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఈగ మల్లేశంలు హాజరై కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మాట్లాడుతూ తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు, తెలంగాణ ఏర్పాటుకై మంత్రి పదవిని త్యాగం చేసిన మహనీయుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని అన్నారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి ప్రొఫెషనల్స్ అండ్ ఆఫీషియల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్, పద్మశాలి సంఘం రాష్ట్ర నాయకులు గుండు ప్రభాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వడ్నాల నరేందర్, వరంగల్ జిల్లా గౌరవాధ్యక్షులు కుసుమ సతీష్, నాయకులు యెలుగం సత్యనారాయణ, యెలుగం చిన్నభద్రయ్య, గుండేటి నరేందర్, మెరుగు సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

శంభునిపేట: ఖిలావరంగల్ హనుమాన్ విగ్రహం వద్ద కొండా లక్ష్మణ్ లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలతో అభిషేకం చేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సామాజిక వేత్తలు మెరుగు అశోక్, చెన్నూరి దేవేందర్ మాట్లాడుతూ.. కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహ ప్రతిష్ఠాపనకు నగరంలోని పద్మశాలి నాయకులు, ప్రజాప్రతినిదులు ముందుకు వచ్చి సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆడెపు రవీందర్, గౌరవాధ్యక్షుడు కుసుమ సతీష్, గుండేట నరేందర్, కోఆర్డినేటర్ వడ్నాల నరేందర్, గోరంటాల రాజు, బైరి శ్యామ్, బేతి అశోక్, సమ్మన్న, రాజగోవింద్, వెంకటేష్, గడ్డం రవి, కోడం ప్రతాప్, రాజేంద్రప్రసాద్, నిరంజన్, శివకుమార్, సుధాకర్, కిషన్, మాచర్ల దీన్‌దయాళ్, రవీందర్, బిక్షపతి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

శివనగర్‌లోని పద్మశాలి అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోపా రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో పోపా జిల్లా అధ్యక్షుడు గుండు కామేశ్వర్, నాయకులు పాము శ్రీనివాస్, బైరి శ్యామ్‌సుందర్, మెరుగు సుభాష్, గోషికొండ సుధాకర్, ధర్మపురి రాజగోవింద్, మాటేటి అశోక్, సంతోష్, కందగట్ల రాకేష్, బత్తుల సత్యం, తుమ్మ రమేష్, రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

42వ డివిజన్ కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ తన కార్యాలయంలో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు నిర్వహించారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం మంత్రి పదవిని వదులుకున్న మొట్టమొదటి నాయకుడు కొండా లక్ష్మణ్ బాపూజీ అని కొనియాడారు. దేశ ప్రజలంతా ఆయన అడుగుజాడల్లో నడవాలని కోరారు. రంగశాయిపేట, శంభునిపేట పద్మశాలి పరపతి సంఘంలో సంఘం అధ్యక్షులు గుండు పూర్ణచందర్ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

గిర్మాజీపేట: ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా శనివారం వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో నివాళి అర్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరికిషన్, సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగన్మోహనాచారి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ డాక్టర్ దుర్గాబాయి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న బస్వరాజు సారయ్య

కొండా లక్ష్మణ్ సేవలు మరువలేనివి

పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ

మామునూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన సేవలు మరువలేనివని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ అన్నారు. శనివారం మామునూరు పీటీసీ ప్రాంగణంలో ఆచార్యకొండా లక్ష్మణ్ బాపూజీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిజాంకు వ్యతిరేకంగా తెలంగాణ ఉద్యమాన్ని నడిపిన నాయకులలో కొండా లక్ష్మణ్ ప్రముఖుడని అన్నారు. 1969లో జరిగిన తెలంగాణ ఉద్యమంలో తన మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన వ్యక్తి అని కొనియాడారు. 96 ఏండ్ల వయసులో కూడా ఎముకలు కొరికే చలిలో తన ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో తెలంగాణ కోసం దీక్ష చేసిన మహా యోధుడని కీర్తించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు భిక్షపతి, వెంకటేశ్వర్‌రావు, రవీందర్, సోమాని, ఏవో కల్పనా రెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్, పీటీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మామునూరు 4వ బెటాలియన్‌లో కమాండెంట్ డి.శివప్రసాద్ రెడ్డి బాపూజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన తెలంగాణ రాష్ట్రానికి చేసిన సేవల గురించి వివరించారు. కార్యక్రమంలో 4వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్స్ శ్రీనివాసరావు, వీరన్న, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు విజయ్, రాజ్ కుమార్, 4వ బెటాలియన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మామునూరు పీటీసీలో నివాళి అర్పిస్తున్న ప్రిన్సిపాల్ పూజ, సిబ్బంది



కొత్తవాడలో కొండా లక్ష్మణ్ విగ్రహం వద్ద పోపా నాయకుల నివాళి



ఖిలా వరంగల్ హనుమాన్ విగ్రహం వద్ద బాపూజీ జయంతి వేడుకలు



ఆయుర్వేద ఆస్పత్రిలో నివాళులు అర్పిస్తున్న వైద్యులు, సిబ్బంది



లలిత పరమేశ్వరి అలంకరణలో రాజరాజేశ్వరి అమ్మవారు

వైభవంగా సాగుతున్న నవరాత్రోత్సవాలు

● మండపాల వద్ద ఘనంగా చండీ హోమాలు, అన్నదానాలు

వరంగల్‌కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నగరంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. శనివారంకు ఆరో రోజు అమ్మవారి దేవాలయాల్లో ఉదయం, సాయంత్రం అమ్మవారి ప్రత్యేక పూజలు, చండీ హోమాలు నిర్వహించారు. ఎంజీఎం సెంటర్‌లోని శ్రీరాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారిని లలితా పరమేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనానికి ఏర్పాటు చేశారు. ములుగు రోడ్‌లోని శ్రీగణపతి సచ్చిదానంద వరద దత్తక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి భక్తుల దర్శనానికి ఏర్పా టు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలి రాగా గోపూజ, మహాపూజ నిర్వహించారు. అదేవిధంగా వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో, రంగంపేటలోని శివాలయంలో, వెంకట్రామ జంక్షన్‌లోని కనక దుర్గా దేవాలయంలో నవరాత్రి వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి.

శంభునిపేట: రంగశాయిపేట గాంధీ జంక్షన్‌లో వీరాంజనేయ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు శాకాంబరీగా దర్శనమిచ్చారు. వెలిదె భార్గవ శర్మ చేతుల మీదుగా కాత్యాయనీ అవతార పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు.

రంగశాయిపేటలోని జెండాగద్దె వద్ద శివపుత్ర యూత్ ఆధ్వర్యంలో అమ్మవారు శాకాంబరిగా దర్శనమిచ్చారు. అనంతరం మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు.

రామాలయంలో మహిళల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినగర్ కాలనీ, విశ్వనాథ కాలనీల్లో మండపాల వద్ద అమ్మవారికి పూజలు చేశారు. ఈ వేడుకల్లో భవానీ దీక్షాదారులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



27ఎస్‌జీటీ02 : రంగశాయిపేటలో అమ్మవారి పూజలో భక్తులు



రంగశాయిపేట గాంధీ జంక్షన్‌లో శాకాంబరిగా అమ్మవారు



దత్తక్షేత్రంలో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

రౌడీ షీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలి



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్పీ శుభం ప్రకాష్, సీఐ రమేష్

కరీమాబాద్, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): రౌడీ షీటర్లు సత్ప్రవర్తన అలవర్చుకోవాలని వరంగల్ ఏఎస్పీ శుభం ప్రకాష్ అన్నారు. శనివారం మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని 44 మంది రౌడీషీటర్లకు సీఐ బొల్లం రమేష్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవి నవరాత్రులు, సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా ప్రవర్తించినా, అల్లర్లకు పాల్పడినా రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా 44 మంది రౌడీషీటర్లను ఖిలావరంగల్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. కార్యక్రమంలో మిల్స్‌కాలనీ ఎస్సైలు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తలకు సత్కారం

శంభునిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శంభునిపేట విశ్వనాథకాలనీకి చెందిన పొడిశెట్టి నరసింహప్రసాద్ రంగశాయిపేటలోని ప్రసిద్ధ భవానీ శంకరాలయం ధర్మకర్తగా, వడ్లకొండ జగన్నాథం ఉర్ఫు నాగమయ్య ఆలయ ధర్మకర్తగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం న్యూ విశ్వనాథ పరపతి సంఘం డైరెక్టర్‌ల ఆధ్వర్యంలో ఆ ఇద్దరినీ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు కర్నె రవీందర్, కత్తి ఎల్లగౌడ్, వలుపదాసు కృష్ణ, పల్లకొండ సురేష్, సార్ల సంజీవ్, కంది శ్రీధర్ రెడ్డి, కత్తి సాంబయ్య, కర్నె వాసుదేవ్, నరసింహస్వామి, జిర్ర రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి

మట్టెవాడ, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): భారతీయ జీవిత బీమా సంస్థ(ఎల్ఐసీ) ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఏజెంట్ల సమాఖ్య(లియాఫి-1964) వరంగల్ డివిజన్ ప్రెసిడెంట్ పులి సుధాకర్ అన్నారు. శనివారం ములుగు రోడ్‌లోని సంస్థ కార్యాలయంలో డివిజన్ నాయకుడు పబ్బా రాజశ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో ఆకుల కుమారస్వామి, తండా అశోక్, మల్లాడి రాజిరెడ్డి, గన్నోజు శ్రీనివాసాచారి, మన్నెం ఇంద్రారెడ్డి, ఎరుకల రఘునారెడ్డి, దాడి భిక్షపతి, ఆవునూరి కుమారస్వామి, ఐదులాపురం సురేందర్ పాల్గొన్నారు.

మంత్రి తుమ్మలను కలిసిన టీపీసీసీ నాయకుడు



మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిప్ప వెంకటేశ్వర్లు

వరంగల్ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత జౌళి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును టీపీసీసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతి వేడుకలకు హాజరైన ముఖ్యఅతిథిగా మంత్రి హాజరైన సందర్భంగా మేయర్ గుండు సుధారాణితో కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షులు గూడురు శ్రీనివాస్, రాష్ట్ర నాయకులు మచ్చా వరలక్ష్మీ, అంకం శ్రీనివాస్, కోనంపేట నర్సింగ్, నాయకులు మన్న రవికుమార్, కొంగ కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ

శంభునిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని 34వ డివిజన్ పారిశుధ్య కార్మికులకు కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి అభిమానులు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. కార్పొరేటర్ దిడ్డి కుమారస్వామి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ నాయకులు, అభిమానులు కలిసి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

బతుకమ్మ ఆటస్థలానికి ఏర్పాట్లు



తూర్పుకోటలో బతుకమ్మ ఆటస్థలాన్ని పరిశీలిస్తున్న ఉత్సవ నిర్వాహకులు

శంభునిపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : తూర్పుకోటలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు నిర్వహించే ప్రాంగణాన్ని ఉత్సవ నిర్వాహకులు శనివారం పరిశీలించారు. నాలుగు రోజులుగా కురుస్తున్నందున మహిళలు ఇబ్బంది పడకుండా యాదవవాడ, కోటకింది బతుకమ్మ ప్రాంగణాలను సిద్ధం చేయిస్తున్నారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ బోగి సువర్ణసురేష్ మాట్లాడుతూ.. కార్పొరేషన్ నుంచి అన్ని వసతులు కల్పిస్తామని, ఈనెల 30న బతుకమ్మ వేడుకలతో పాటు అక్టోబరు 2న దసరా ఉత్సవాల సందర్భంగా రావణ వధ కార్యక్రమాలను వైభవంగా జరిపిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి బాధ్యులు కందిమల్ల మహేష్, బోయిని దూడయ్య, మేకల కుమార్, సంగబోయిన చందర్, అరసం రాంబాబు, వనపర్తి ధర్మరాజు, బెడద వీరన్న, వనపర్తి కర్నాకర్, ఏసీరెడ్డి రమేష్, సంగని శివ, బిల్లా కిషార్, సుంచు జగదీశ్, బేర నరేందర్, బండారి నవీన్, తొర్రి రాజమల్లు, దేవర కమలాకర్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ భవన్‌కు స్థలం కేటాయించాలి

ఎమ్మెల్యేను కోరిన పద్మశాలీ పరపతి సంఘాల జేఏసీ

హనుమకొండ కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీసీ భవన్‌కు 1000 గజాల స్థలం కేటాయించాలని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని పద్మశాలీ పరపతి సంఘాల జేఏసీ నాయకులు శనివారం కోరారు. కొండా లక్ష్మణ్ బాపూజీ 110వ జయంతిని పురస్కరించుకుని బాలసముద్రంలోని ఏకశిలాపార్కు నుంచి సుబేదారిలోని ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్ వరకు ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీస్ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన వేడుకలలో పద్మశాలీ జేఏసీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ పరపతి సంఘాల కన్వీనర్ వైద్యం రాజగోపాల్, అఖిల భారత పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు ఈగ మల్లేశం, మాజీ వైస్ చైర్మన్ శ్రీరాములు, భద్రకాళి దేవస్థానం డైరెక్టర్ బింగి సతీష్, పద్మశాలీ సంఘం నాయకులు గడ్డం భాస్కర్, గడ్డం కేశవమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'పంచ పరివర్తన్' ద్వారా దేశ హితం

హసన్‌పర్తి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో అన్ని వర్గాల వారు ఐకమత్యంగా ఉండాలనే లక్ష్యంతోనే పంచ పరివర్తన్‌కి ఆర్ఎస్ఎస్ శ్రీకారం చుట్టిందని హిందూ జాగరణ మంచ్ అఖిల భారతీయ సంఘటన మంత్రి దేవేందర్ అన్నారు. ఆర్ఎస్ఎస్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని హసన్‌పర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. సామాజిక సమరత, పర్యావరణం, కుటుంబ ప్రబోధన్, స్వదేశీ పౌర నియమాలు అనే ఐదు విషయాలను సమాజంలో ప్రతి పౌరుడు తెలుసుకొని వాటి ఆచరణకు కృషి చేయాలన్నారు. వీటి ద్వారా సమాజంలో సమూలమైన మార్పు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పావుశెట్టి సాంబయ్య, ఆర్ఎస్ఎస్ విభాగ్ అధ్యక్షులు ప్రొఫెసర్ చిలకమారి సంజీవ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ★★
ANDHRAJYOTHY 5 గ్రేటర్ వరంగల్
ఆదివారం 28 సెప్టెంబరు 2025

బలాన్నిచ్చే బతుకమ్మ ఫలహారాలు

- ఎన్నెన్నో ఆరోగ్య పోషకాలకు నిలయం
- తొమ్మిది రోజులు.. తొమ్మిది రకాలు..
- తరతరాలుగా కొనసాగుతున్న సంప్రదాయం

7



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

వరంగల్ జిల్లా జడ్పీటీసీ, ఎంపీపీ రిజర్వేషన్ల వివరాలు

మండలం	జడ్పీటీసీ	ఎంపీపీ
చెన్నారావుపేట	జనరల్ మహిళ	జనరల్ మహిళ
దుగ్గొండి	జనరల్	జనరల్
గీసుగొండ	ఎస్సీ జనరల్	ఎస్సీ జనరల్
ఖానాపురం	ఎస్టీ జనరల్	ఎస్టీ మహిళ
నల్లబెల్లి	బీసీ జనరల్	బీసీ జనరల్
నర్సంపేట	ఎస్టీ మహిళ	ఎస్టీ జనరల్
నెక్కొండ	బీసీ జనరల్	బీసీ మహిళ
పర్వతగిరి	బీసీ జనరల్	బీసీ జనరల్
రాయపర్తి	బీసీ మహిళ	బీసీ మహిళ
సంగెం	బీసీ మహిళ	బీసీ జనరల్
వర్ధన్నపేట	ఎస్సీ మహిళ	ఎస్సీ మహిళ



ఎవరు.. ఎక్కడ?!

- కులగణన సర్వే ప్రాతిపదికన బీసీ స్థానాలకు కేటాయింపు
- 68.2 శాతానికి పెరిగిన బీసీల జనాభా నిష్పత్తి
- డ్రా పద్ధతి ద్వారా నిర్ణయించిన అధికారులు
- గతంలో కన్నా పెరిగిన బీసీల సీట్లు
- ఆశావహుల్లో వెల్లివిరుస్తున్న సంతోషం
- గ్రామాల్లో మొదలైన స్థానిక సంస్థల సందడి

6

ఖరారైన జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాల రిజర్వేషన్లు

వరంగల్ జడ్పీ ఛైర్‌పర్సన్ ఎస్టీ జనరల్

- ఉమ్మడి జిల్లాకు ఖరారైన రిజర్వేషన్లు
- 2 ఎస్టీలకు, 2 ఎస్సీలకు 1 బీసీకి, 1 జనరల్‌కు రిజర్వు

హనుమకొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవుల రిజర్వేషన్లను రాష్ట్రప్రభుత్వం శనివారం ఖరారు చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆరు జిల్లా పరిషత్‌లలో రెండు ఎస్టీలకు, రెండు ఎస్సీలకు, ఒకటి బీసీకి రిజర్వు కాగా, ఒకటి జనరల్ అయింది. మూడు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు మహిళలకు కేటాయించారు. మూడు జనరల్‌గా ప్రకటించారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలులోకి వచ్చినప్పటికీ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులను రాష్ట్రం యూనిట్‌గా తీసుకొని రిజర్వు చేయడం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ వర్గానికి ఒక్క స్థానమే దక్కింది. హనుమకొండ జిల్లా పరిషత్ ఎస్సీ మహిళకు రిజర్వు కాగా, వరంగల్ జిల్లా పరిషత్ ఎస్టీ జనరల్‌కు రిజర్వు అయింది. జనగామ ఎస్సీ మహిళ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా బీసీ జనరల్, ములుగు ఎస్టీ మహిళకు, మహబూబాబాద్ జనరల్ రిజర్వు అయింది.

భువనేశ్వరిగా భద్రకాళి అమ్మవారు

- ఆరో రోజుకు చేరిన నవరాత్రి ఉత్సవాలు
- అమ్మవారిని దర్శించుకున్న ఉప ముఖ్యమంత్రి సతీమణి



ఆలయంలో పూజలు చేస్తున్న ఉప ముఖ్యమంత్రి సతీమణి నందిని

వరంగల్ కల్చరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరోరోజు శనివారం ఉయం 4 గంటలకు నిత్య పూజ అనంతరం ప్రధానార్చకుడు భద్రకాళి శేషు నేతృత్వంలో అమ్మవారిని భువనేశ్వరి మాతగా అలంకరించి పూజలు నిర్వహించారు. శాస్త్రప్రకారం ఈ ఏడాది నవరాత్రులు పది రోజులు వచ్చాయని శేషు తెలిపారు. అమ్మవారిని ఆరో రోజున భవానీమాతగా అలంకరిస్తాం.. కానీ ఈ ఏడాది పది రోజులు నవరాత్రి ఉత్సవాలు వచ్చినందున భువనేశ్వరి మాతగా అలంకరించి పూజలు చేశామని అన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి గంధోత్సవం, సాలబంజిక సేవను నిర్వహించామన్నారు. 18 మెట్లపై ఉన్న అమ్మవారిని అధిరోహిస్తూ ఈ జగన్మాతను దర్శించడంవల్ల విజయ ప్రాప్తి కలుగుతుందని తెలిపారు. అమ్మవారి ఉభయదాత సేవా కర్తలు పూజలు నిర్వహించగా సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. భద్రకాళి సేవా సమితి ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నప్రసాదం అందించారు.

ఉప ముఖ్యమంత్రి సతీమణి పూజలు

ఉపముఖ్యమంత్రి సతీమణి నందిని భట్టి విక్రమార్క శనివారం భద్రకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆమెకు ఆశీర్వచనం, అమ్మవారి తీర్థప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో రామల సునిత, ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

రెండోరోజు మద్యం దరఖాస్తులు నిల్

ఫీజు పెంచినందుకా..? ముహూర్తం లేనందుకా..?

వరంగల్ క్రైం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్త మద్యం షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసి రెండు రోజులైనప్పటికీ ఆబ్కారీ అధికారులు ఏర్పాటు చేసిన దరఖాస్తు కౌంటర్లు వెలవెలబోతున్నాయి. వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఒక్క దరఖాస్తు దాఖలు కాలేదు. గతంలో టెండర్ ఫీజు రూ.2లక్షలు (నాన్ రిఫండబుల్)ను కొత్త మద్యం పాలసీలో రూ.3లక్షలకు పెంచడంతో దరఖాస్తులకు వెనకాడుతున్నారా..? లేదా అదృష్టం దక్కించుకోవడానికి మంచి ముహూర్తం కోసం వేచి చూస్తున్నారా? అనే అంశంపై ప్రస్తుతం చర్చ జరుగుతోంది. ప్రతీసారి దరఖాస్తుల స్వీకరణ ముగుస్తున్న తరుణంలో అత్యధికంగా దరఖాస్తులు వస్తుంటాయి. ఇప్పుడు కూడా అదే తరహాలో వస్తాయా..? రూ.2లక్షలు ఉన్న ఫీజు రూ.3లక్షలకు పెంచినందుకు వెనకాడతారా? అనేది వేచి చూడాలి.

హనుమకొండ బస్‌స్టేషన్ కిటకిట

- ప్రయాణికులతో కిక్కిరిసిన ప్రాంగణం
- సెలవుల కారణంగా ఇళ్లకు బయలు దేరిన జనం



ప్రయాణికులతో రద్దీగా మారిన హనుమకొండ బస్‌స్టేషన్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బతుకమ్మ, దసరా సెలవులు రావడంతో హనుమకొండ బస్‌స్టేషన్ ప్రాంగణం ప్రయాణికులతో శనివారం రద్దీ ఏర్పడింది. పలు రూట్లల్లో ప్రయాణికులకు సరిపడా బస్సులు లేక బస్‌స్టేషన్ ప్రాంగణంలో గంటల తరబడి పడిగాపులు కాశారు. ఇటీవల కురుస్తున్న వర్షాల కారణంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్టాండ్ ప్రాంగణం వరద నీటిలో మునగడంతో హనుమకొండ నుంచి హైదరాబాద్‌కు వెళ్లే బస్సులు ఉప్పల్ వరకే నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జిల్లాలోని కంఠాత్మకూరు మాటువాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బస్సులను రూట్ మార్చి నడుపుతున్నట్లు తెలిపారు. కటాక్షపూర్ మత్తడి పెరగడంతో సాయంత్రం సమయంలో బస్సులను తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆర్టీసీ ఆర్ఎం డి.విజయభాను తెలిపారు. హనుమకొండ బస్టేషన్ నుంచి ఇతర రూట్లల్లో అన్ని సర్వీస్‌లు నడిపిస్తున్నామని, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయాణికులు సహకరించాలని ఆర్ఎం పేర్కొన్నారు.

జయహో.. దీప్తి జీవాంజీ

అంతర్జాతీయ పోటీల్లో సిల్వర్ మెడల్ కైవసం



ఢిల్లీలో జరిగిన పోటీల్లో గెలిచి సిల్వర్ మెడల్ చూపుతున్న దీప్తి జీవాంజీ

పర్వతగిరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన దీప్తి జీవాంజీ అంతర్జాతీయ పారా అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ - 2025 పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించింది. శనివారం ఢిల్లీలో జరిగిన 400 మీటర్ల పరుగు పందెంలో 55.16 సెకన్ల సమయంలో లక్ష్యాన్ని పూర్తి చేసి రాణించింది. ఈ సందర్భంగా తాను చదువుకున్న పాఠశాలలో ఆర్డీఎఫ్ వ్యవస్థాపకుడు ఎర్రబెల్లి రాంమోహన్ రావు అభినందనలు తెలిపారు. తల్లిదండ్రులు, గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు సైతం ఆనందం వ్యక్తం చేశారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

వరంగల్ పీడీఎం జడ్జి కందుకూరి పూజ

మామునూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని వరంగల్ పీడీఎం జడ్జి కందుకూరి పూజ అన్నారు. వరంగల్ మామునూరులోని లెనిన్‌నగర్ కమ్యూనిటీ హాల్లో మామునూరు పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు చట్టాలపై అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి కందుకూరి పూజ హాజరై మాట్లాడారు. చెవిటి, మూగవారిని తక్కువ చేసి చూడరాదని, రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసబిలిటీస్ యాక్ట్ - 2016 ప్రకారం వారిని అవమానించడం చట్టరిత్యా నేరమని ఆమె స్పష్టం చేశారు. అదే విధంగా బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలికలపై జరిగే దాడులు, చట్టపరమైన రక్షణ చర్యలపై ఆమె అవగాహన కల్పించారు. మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఈ.హరిక మాట్లాడుతూ.. బాల్యవివాహాలు నివారించాలన్నారు. మహిళలపై హింసను నిర్మూలించడం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అధికారి రజిని, మామునూరు సీఐ ఓ.రమేష్, ఎస్ఐలు టి.శ్రీకాంత్, ఎస్.కృష్ణవేణి, కోర్టు సిబ్బంది, కాలనీ వాసులు, మహిళలు, వృద్ధులు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం బారులు తీరిన రైతులు

నెక్కొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ సాగుకు యూరియా అత్యవసరం కావడంతో శనివారం తెల్లవారు జామున రెండు గంటల నుంచే నెక్కొండ రైతు వేదిక వద్ద రైతులు బారులు తీరారు. యూరియా కూపన్లు ఇస్తున్న సమాచారం తెలవడంతో వందల సంఖ్యలో రైతులు రైతు వేదిక వద్దకు చేరుకున్నారు. దాదాపు ఐదు గంటలు రైతులు లైన్లలో నిలుచున్నారు. వర్షం వస్తున్న కూడా లైన్ల నుంచి రైతులు కదల కుండా అలాగే ఉన్నారు. మహిళా రైతులు కూడా రావడంతో యూరియా అవసరం ఎంత ఉందనేది తెలుస్తుంది. నెక్కొండ సొసైటీ పరిధిలోని నాలుగు గ్రామాల రైతులకు కేవలం ఆరు వందల బస్తాల యూరియా అందించారు. దీంతో యూరియా దొరకని రైతులు నిరాశతో వెనుదిరిగారు. పండుగ సమయంలో సైతం రైతులకు ఈ బాధలు తప్పవా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నెక్కొండ రైతు వేదిక వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

స్థానిక రిజర్వేషన్లు ఖరారు

నర్సంపేట,సెప్టెంబరు27 (ఆంధ్రజ్యోతి) : గత కొంత కాలంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఎన్నికల సంఘం శనివారం ప్రకటించింది. నర్సంపేట ఎంపీపీ స్థానం ఎస్టీ మహిళ, జడ్పీటీసీ స్థానం ఎస్టీ మహిళగా రిజర్వేషన్లు ఖరారయ్యాయి. మండలంలోని 19 గ్రామాల సర్పంచులు, 7ఎంపిటీసీల రిజర్వేషన్లు అధికారులు ఖరారు చేశారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు..

బాంజీపేట (జనరల్), చంద్రయ్యపల్లె (ఎస్టీ మహిళ), గురిజాల (ఎస్సీ జనరల్), ఇటుకాలపల్లి (బీసీ మహిళ), కమ్మపల్లి (బీసీ మహిళ), లక్నెపల్లి (బీసీ జనరల్), రాజుపేట (ఎస్టీ జనరల్)గా రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

సర్పంచ్‌ల రిజర్వేషన్లు..

ఆకుల తండా (బీసీ జనరల్), బాంజీపేట (ఎస్సీ జనరల్), బోజ్యానాయక్ తండా (ఎస్టీ జనరల్), చంద్రయ్యపల్లె (ఎస్టీ జనరల్), చిన్నగురుజాల (జనరల్), దాసరిపల్లె (బీసీ మహిళ), ఎనుగులతండా (జనరల్), గుర్రాలగండిరాజపల్లె (జనరల్), గుంటూరుపల్లె (ఎస్టీ మహిళ), గురిజాల (బీసీ జనరల్), ఇప్పల్‌తండా (ఎస్టీ జనరల్), ఇటుకాలపల్లి (జనరల్ మహిళ), కమ్మపల్లి (ఎస్సీ మహిళ), లక్నెపల్లి (బీసీ మహిళ), ముత్యాలమ్మతండా (బీసీ జనరల్), రాజేశ్వరరావుపల్లె (జనరల్ మహిళ), రాజుపేట (ఎస్టీ మహిళ), రామవరం (బీసీ మహిళ)కు రిజర్వు అయ్యాయి.

• రాయపర్తి (ఆంధ్రజ్యోతి): రాయపర్తి మండల జడ్పీటీసీ (బీసీ మహిళ), ఎంపీపీ (బీసీ మహిళ)లకు రిజర్వేషన్లు కేటాయించారు. మండలంలోని ఉన్న 16 ఎంపీటీసీ స్థానాలకు, 41 గ్రామపంచాయతీలకు రిజర్వేషన్లు ఖరారు చేశారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు..

రాయపర్తి 1 (ఎస్సీ జనరల్), రాయపర్తి 2(బీసీ మహిళ), మైలారం (బీసీ మహిళ), తిర్మలాయపెల్లి (ఎస్సీ మహిళ), కొండూరు (బీసీ జనరల్), మొరిపిరాల (బీసీ జనరల్), కాట్రపల్లి(బీసీ జనరల్), ఊకల్ (ఎస్టీ మహిళ), కొండాపురం(ఎస్టీ మహిళ), సూర్యతండా(జనరల్ మహిళ), పెర్కవేడు(జనరల్), రాగన్నగూడెం(ఎస్టీ జనరల్), కేశవపురం(ఎస్సీ మహిళ), కొలన్‌పల్లి(ఎస్టీ జనరల్), సన్నూరు(బీసీ మహిళ), కొత్తూరు (బీసీ జనరల్).

సర్పంచ్ రిజర్వేషన్లు..

ఏకే తండా (ఎస్టీ జనరల్), బాలాజీ తండా (ఎస్టీ జనరల్), బాల్ నాయక్ తండా (ఎస్టీ మహిళ), దుబ్బ తండా (ఎస్టీ మహిళ), ఎర్ర కుంట తండా (ఎస్టీ మహిళ), గణేష్ కుంట తండా (ఎస్టీ జనరల్), జిత్తురాం తండా (ఎస్టీ మహిళ), జయరాం తండా(కె) (ఎస్టీ మహిళ), జయరాం తండా (ఎస్)(ఎస్టీ జనరల్), జానకమ్మ తండా (ఎస్టీ మహిళ), పానీష్ తండా (ఎస్టీ మహిళ), పన్యానాయక్ తండా (ఎస్టీ మహిళ), సూర్యతండా (ఎస్టీ జనరల్), వాంకుడోతు తండా(ఎస్టీ జనరల్), ఊకల్(ఎస్టీ మహిళ), తెట్టెకుంట తండా (ఎస్టీ జనరల్), సన్నూరు (ఎస్సీ మహిళ), మైలారం (ఎస్సీ జనరల్), తిర్మలాయపెల్లి (ఎస్సీ జనరల్), గన్నారం (ఎస్సీ మహిళ), వెంకటేశ్వపెల్లి (ఎస్సీ జనరల్), కొలన్‌పల్లి (ఎస్సీ మహిళ), కొండాపురం (బీసీ మహిళ), పెర్కవేడు (బీసీ మహిళ), మొరిపిరాల (బీసీ జనరల్), కొలన్‌పెల్లి (బీసీ మహిళ), కొండూరు (బీసీ జనరల్), రాయపర్తి (బీసీ మహిళ), రాగన్నగూడెం (బీసీ మహిళ), కొత్తూరు (బీసీ మహిళ), మహబూబ్ నగర్ (బీసీ జనరల్), కిష్టాపురం (బీసీ జనరల్), జగన్నాధపల్లి (బీసీ జనరల్), ఆరెగూడెం (జనరల్), గట్టికల్లు (జనరల్ మహిళ), కాట్రపల్లి (జనరల్ మహిళ), కేశవపురం (జనరల్), పోతురెడ్డిపెల్లి (జనరల్), బందనపల్లి (జనరల్ మహిళ), శివరామపురం (జనరల్).

• పర్వతగిరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని 14 ఎంపీటీసీస్థానాలకు, 33 గ్రామపంచాయతీలకు శనివారం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు బీసీ జనరల్‌కు కేటాయించారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు..

గోపనపెల్లి(ఎస్సీ మహిళ), కొంకపాక(ఎస్టీ జనరల్), చౌటపెల్లి(ఎస్టీ జనరల్), మల్యా తండా(జనరల్), ఏనుగల్లు (జనరల్ మహిళ), చింత నెక్కొండ 1(ఎస్టీ మహిళ), చింతనెక్కొండ 2(ఎస్టీ జనరల్), దౌలత్‌నగర్ (బీసీ జనరల్), తురుకల సోమారం(బీసీ జనరల్), వడ్లకొండ(ఎస్టీ జనరల్), పర్వతగిరి 1(బీసీ జనరల్), పర్వతగిరి 2(బీసీ మహిళ, కల్లెడ(బీసీ మహిళ), అన్నారం షరీఫ్(బీసీ మహిళ)లకు కేటాయించారు.

సర్పంచ్ రిజర్వేషన్లు..

అనంతారం(జనరల్ మహిళ), గోపనపెల్లి(బీసీ మహిళ), కొంకపాక (బీసీ మహిళ), శ్రీనగర్(జనరల్), మూడెత్తుల తండా(ఎస్టీ జనరల్), చౌటపల్లి (బీసీ జనరల్), హట్యా తండా (ఎస్టీ జనరల్), గోడుగుట్ట తండా(ఎస్టీ మహిళ), జమాల్‌పురం (జనరల్), తురుకుల సోమారం (బీసీ జనరల్), గుగులోతు తండా(ఎస్టీ జనరల్), మాల్య తండా (ఎస్టీ జనరల్), ఏనుగల్లు(జనరల్), తూర్పు తండా(ఎస్టీ జనరల్), ఎన్‌జీ తండా (ఎస్టీ జనరల్), చింతనెక్కొండ (బీసీ జనరల్), అడ్డాబాట తండా (జనరల్ మహిళ), దౌలత్‌నగర్(ఎస్టీ మహిళ), చెరువుకొమ్ము తండా (ఎస్టీ మహిళ), ఇస్లావత్ తండా (ఎస్టీ మహిళ), పర్వతగిరి (ఎస్సీ జనరల్), వడ్లకొండ(ఎస్సీ మహిళ), రోళ్లకల్(బీసీ మహిళ), నారాయణపురం (ఎస్టీ జనరల్), కల్లెడ(ఎస్సీ జనరల్), ముంజాలకుంట తండా (ఎస్టీ మహిళ), బూరుగుమళ్ల (బీసీ జనరల్), మంగ్యా తండా(ఎస్టీ మహిళ), రావూరు(ఎస్టీ మహిళ), మోత్యా తండా(ఎస్టీ మహిళ), పెద్ద తండా(ఎస్టీ మహిళ), దూపతండా(ఎస్టీ జనరల్), అన్నారం షరీఫ్(బీసీ మహిళ).

• దుగ్గొండి (ఆంధ్రజ్యోతి): మండల జడ్పీటీసీ జనరల్, ఎంపీపీ జనరల్ కావడంతో పాటు 12 ఎంపీటీసీలు, 34 గ్రామ పంచాయతీలు, 282 వార్డు సభ్యుల రిజర్వేషన్ లను అధికారులు ఖరారు చేశారు. 12 ఎంపీటీసీలలో ఎస్సీలకు 2, ఎస్టీకి 1, బీసీలకు 5, జనరల్ 4 కేటాయించారు. 34 గ్రామ సర్పంచ్‌లలో ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 14, జనరల్ 12 కేటాంచారు.

ఎంపీటీసీల రిజర్వేషన్లు..

నాచినపల్లి (ఎస్సీ జనరల్), చాపలబండ (ఎస్టీ మహిళ), తిమ్మంపేట (ఎస్సీ మహిళ), చలపర్తి (బీసీ జనరల్), తొగర్రాయి (బీసీ జనరల్), పొనకల్ (జనరల్), వెంకటాపురం (జనరల్), లక్ష్మీపురం (జనరల్ మహిళ), దుగ్గొండి (బీసీ మహిళ), మల్లంపల్లి (బీసీ మహిళ), ముద్దునూరు(బీసీ జనరల్)గా ఖరారు అయ్యాయి.

సర్పంచ్ రిజర్వేషన్లు..

రెబల్లే (ఎస్టీ మహిళ), రాజ్యతండా (ఎస్టీ మహిళ) పీజీతండా (ఎస్టీ జనరల్), ముద్దునూరు (ఎస్సీ మహిళ), స్వామిరావుపల్లి (ఎస్సీ జనరల్), బిక్కాజిపల్లి (జనరల్), గుడిమహేశ్వరం (జనరల్ మహిళ), శివాజీనగర్ (జనరల్ మహిళ), గుడ్డెలుగులపల్లి (జనరల్), బొబ్బరోనిపల్లి (జనరల్), గొల్లపల్లి (జనరల్), దేశాయిపల్లి (జనరల్ మహిళ), మహ్మదాపురం (జనరల్), పొనకల్ (జనరల్), తొగర్రాయి (జనరల్ మహిళ), గిర్నిబావి (జనరల్), నారాయణతండా (జనరల్ మహిళ), తిమ్మంపేట (బీసీ మహిళ), చలపర్తి (బీసీ జనరల్), మర్రిపల్లి (బీసీ మహిళ), మల్లంపల్లి (బీసీ మహిళ), చంద్రయ్యమపల్లి (బీసీ జనరల్), దుగ్గొండి (బీసీ జనరల్), బందంపల్లి (బీసీ జనరల్), కేశవాపురం (బీసీ మహిళ), నాచినపల్లి (బీసీ జనరల్), వెంకటాపురం (బీసీ మహిళ), మైసంపల్లి (బీసీ జనరల్), మధిర (బీసీ మహిళ), అడవిరంగాపురం(ఎస్సీ జనరల్), చాపలబండ (బీసీ జనరల్) ఖరారు అయ్యాయి.

• చెన్నారావుపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు, 30 గ్రామ పంచాయతీ స్థానాలకు అధికారులు రిజర్వేషన్‌లు ఖరారు చేశారు. మండల ఎంపీపీ స్థానాన్ని, జడ్పీటీసీ స్థానాన్ని జనరల్ మహిళలకు కేటాయించారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు..

ఉప్పరపల్లి (బీసీ మహిళ), కోనాపురం(ఎస్టీ మహిళ), లింగాపురం (బీసీ జనరల్), చెన్నారావుపేట, (బీసీ జనరల్), ఖాదర్‌పేట (జనరల్ మహిళ), అమీనాబాద్ (ఎస్టీ జనరల్), లింగగిరి (ఎస్టీ మహిళ), జల్లి (బీసీ మహిళ)బోజేర్వు (బీసీ జనరల్),బోజేర్వు (బీసీ మహిళ), పాపయ్యపేట (ఎస్టీ జనరల్), ఎల్లాయిగూడెం (ఎస్సీ జనరల్)

సర్పంచ్‌ల రిజర్వేషన్లు..

బోజిపేట నారయణతండా (ఎస్టీ జనరల్), అక్కల్‌చెడ (ఎస్టీ మహిళ), తిమ్మారాయిన్‌పహాడ్ (ఎస్టీ జనరల్), కోనాపురం (ఎస్సీ జనరల్), అమీనాబాద్ (ఎస్సీ జనరల్), ఉప్పరపల్లి (ఎస్సీ మహిళ), బోజేర్వు (బీసీ జనరల్) లింగగిరి (బీసీ మహిళ), లింగాపురం (బీసీ మహిళ), జల్లి బీసీ (మహిళ), పాపయ్యపేట (బీసీ జనరల్), చెన్నారావుపేట,(బీసీ మహిళ), ఎల్లాయిగూడెం (బీసీ జనరల్), ఎల్లాయిగూడెం (బీసీ జనరల్), ఖాదర్‌పేట (జనరల్ మహిళ), గొల్లపల్లె (జనరల్ మహిళ),బాపునగర్ (జనరల్), బోడ మాణిక్యంతండా (జనరల్)పదహారు చింతల్‌తండా(ఎస్టీ జనరల్); అమృతండా (ఎస్టీ జనరల్), చెరువుకోమ్ముతండా (ఎస్టీ జనరల్), ధర్మతండా (ఎస్టీ జనరల్), గొల్లబామతండా (ఎస్టీ జనరల్), గొల్లబామతండా(ఎస్టీ జనరల్); జీడీగడ్డతండా (ఎస్టీ మహిళ) పత్తినాయక్‌తండా (ఎస్టీ జనరల్), కాల్‌నాయక్‌తండా (ఎస్టీ జనరల్), కందిగడ్డతండా (ఎస్టీ మహిళ), పత్తినాయక్‌తండా (ఎస్టీ మహిళ), పుల్లయ్యబోడుతండా ఎస్టీ మహిళ, శంకరంతండా (ఎస్టీ మహిళ), సూర్యపేటతండా (ఎస్టీ మహిళ), తోపనగడ్డతండా (ఎస్టీ మహిళ)లకు కేటాయించారు.

ఖానాపురం (ఆంధ్రజ్యోతి): ఖానాపురం మండల ఎంపీటీసీ, సర్పంచ్ ల రిజర్వేషన్ల ఖరారైనాయి. మండలంలోని జడ్పీటీసీ స్థానం ఎస్టీ జనరల్, ఎంపీపీ స్థానం ఎస్టీ మహిళకు కేటాయించారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు..

అశోక్‌నగర్-1 (ఎస్సీ జనరల్), అశోక్‌నగర్-2 (బీసీ మహిళ), ఖానా పురం-1, 2 (బీసీ జనరల్), బుధరావుపేట-1(జనరల్), బుధరావుపేట-2 (ఎస్టీ జనరల్), ధర్మరావుపేట (ఎస్టీ మహిళ), మంగళవారిపేట (జనరల్ మహిళ), కొత్తూరు (బీసీ మహిళ)

సర్పంచ్ రిజర్వేషన్లు..

ఖానాపురం (ఎస్సీ జనరల్), అశోక్‌నగర్ (బీసీ జనరల్), అయోధ్య నగర్ (జనరల్), చిలుకమ్మతండా (ఎస్టీ మహిళ), దబీర్‌పేట (ఎస్టీ మహిళ), కీర్యతండా (ఎస్టీ మహిళ), చిలుకమ్మనగర్ (జనరల్), మనుబోతులగడ్డ (బీసీ మహిళ), బండమీదిమామిడితండా (ఎస్టీ జనరల్), రాగంపేట (బీసీ మహిళ), కొత్తూరు (ఎస్టీ మహిళ), రంగా పురం (బీసీ మహిళ), బుధరావుపేట(జనరల్ మహిళ), ధర్మరావుపేట (బీసీ జనరల్), బాలుతండా (ఎస్టీ జనరల్), మంగళవారిపేట (ఎస్టీ మహిళ), కొడితిమాట్‌తండా (ఎస్టీ మహిళ), భద్రుతండా (ఎస్టీ జనరల్), వేపచెట్టుతండా (ఎస్టీ జనరల్), నాజీతండా (ఎస్టీ మహిళ), బోటిమీదితండా (ఎస్టీ మహిళ)కు కేటాయించారు.

• సంగెం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 33 గ్రామాల్లో గల స్థానిక ఎన్నికల రిజర్వేషన్లను అధికారులు ఖరారుచేశారు. 14 ఎంపీటీసీ స్థానాల్లో ఎస్టీ 2, ఎస్సీ 2, బీసీ ఆరు, ఓసీ నాలుగు ఖరారయ్యాయి.

ఎంపీటీసీల రిజర్వేషన్లు..

సంగెం (బీసీ మహిళ)కుంటపల్లి (బీసీ జనరల్), కాట్రపల్లి (బీసీ జనరల్), కాపులకనపర్తి (ఎస్సీ మహిళ), గవిచర్ల (ఓసీ మహిళ), రాంచంద్రాపురం (ఎస్సీ జనరల్), లోహిత(బీసీ మహిళ), తీగరాజుపల్లి (ఎస్టీ మహిళ), తిమ్మాపురం (బీసీ మహిళ) ఎల్గూరురంగంపేట(ఓసీ మహిళ) మొండ్రాయి (ఓసీ జనరల్) నల్లబెల్లి (ఎస్టీ జనరల్) పల్లార్‌గూడ (ఓసీ జనరల్) చింతలపల్లి (బీసీ జనరల్)లు ఖరారు అయ్యాయి.

సర్పంచ్‌ల రిజర్వేషన్లు

బిక్కోజీనాయక్ తండా (ఎస్టీ జనరల్), బాల్‌నాయక్‌తండ (ఎస్టీ జనరల్) సోమ్లతండా (ఎస్టీ మహిళ), పెద్ద తండా (ఎస్టీ మహిళ), వీఆర్ఎన్‌తండా (ఎస్టీ మహిళ), పోచమ్మ తండా (ఎస్టీ జనరల్), గోల్లపల్లి (ఓసీ మహిళ), ముమ్మడి వరం (ఓసీ జనరల్), నర్సానగర్ (ఓసీ మహిళ), వంజరపల్లి (ఎస్టీ జనరల్), పల్లార్‌గూడ (ఎస్టీ మహిళ), మొండ్రాయి(ఓసీ మహిళ), నార్లవాయి (బీసీ జనరల్), నల్లబెల్లి (బీసీ జనరల్), కృష్ణానగర్ (బీసీ మహిళ), చింతలపల్లి (బీసీ జనరల్), సంగెం (బీసీ మహిళ), కుంటపల్లి (బీసీ మహిళ), కాట్రపల్లి (ఎస్సీ మహిళ), వెంకటాపూరం (ఓసీ మహిళ), కాపులకనపర్తి (ఎస్సీ మహిళ), గుంటు రూపల్లి (ఓసీ జనరల్), ఆశాలపల్లి (ఎస్సీ మహిళ), రాంచంద్రాపురం (ఎస్సీ జనరల్) గవిచర్ల (బీసీ జనరల్) లోహిత (ఎస్సీ జనరల్), షాపురం (బీసీ మహిళ), తీగరాజుపల్లి (ఓసీ జనరల్) గాంధినగర్ (బీసీ జనరల్) కొత్తగూడెం (ఓసీ జనరల్), తిమ్మాపురం (బీసీ జనరల్), ఎల్గూరు స్టేషన్ (ఓసీ జనరల్), ఎల్గురురంగంపేట (బీసీ మహిళ) లు అదికారులు ఖరారు చేశారు

• వర్ధన్నపేట రూరల్ (ఆంధ్రజ్యోతి) :మండలంలోని 11 ఎంపీటీసీ స్థానాలకు, 18 గ్రామ పంచాయతీలకు శనివారం రిజర్వేషన్లు ఖరారయ్యాయి. జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలకు ఎస్సీ మహిళ రిజర్వేషన్‌ను కేటాయించగా, మిగతా గ్రామాల ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలకు సైతం సాయంత్రం కేటాయించారు.

ఎంపీటీసీ రిజర్వేషన్లు..

బండౌతపురం (జనరల్ మహిళ), చెన్నారం (బీసీ మహిళ), దమ్మన్నపేట (ఎస్సీ మహిళ), ఇల్లంద 1 (బీసీ జనరల్), ఇల్లంద 2 (జనరల్), కట్ర్యాల (ఎస్టీ మహిళ), ఉప్పరపెల్లి (బీసీ జనరల్), నల్లబెల్లి (ఎస్సీ జనరల్), ల్యాబర్తి (ఎస్సీ జనరల్), కొత్తపల్లి (బీసీ జనరల్), రామవరం (బీసీ మహిళ)

సర్పంచ్ రిజర్వేషన్లు..

అంబేడ్కర్ నగర్ (జనరల్), బండౌతపురం (బీసీ జనరల్), చంద్రు తండా(ఎస్టీ మహిళ), చెన్నారం (బీసీ మహిళ), దమ్మన్నపేట (ఎస్సీ జనరల్), దివిటిపెల్లి (బీసీ జనరల్), ఇల్లంద (బీసీ మహిళ), కడారిగూడెం (జనరల్ మహిళ), కాషగూడెం (జనరల్), కట్ర్యాల (ఎస్టీ మహిళ), కొత్తపల్లి (బీసీ జనరల్), ల్యాబర్తి (బీసీ మహిళ), నల్లబెల్లి (ఎస్సీ మహిళ), రామవరం (ఎస్సీ మహిళ), రాంధాన్ తండా (ఎస్టీ జనరల్), రామోజీ కుమ్మరిగూడెం తండా (బీసీ జనరల్), ఉప్పరపల్లి (ఎస్సీ జనరల్), బొక్కలగూడెం (వెంకట్రావుపల్లి) (జనరల్ మహిళ).

• నెక్కొండ (ఆంధ్రజ్యోతి): మండల జడ్పీటీసీ బీసీ జనరల్‌కు, ఎంపీపీ బీసీ మహిళకు రిజర్వేషన్ ఖరారయ్యాయి. మండలంలో 16 ఎంపీటీసీ స్థానాలను 5ఎస్టీ, 2ఎస్సీ, 7బీసీ, 2 జనరల్‌కు కేటాయించారు

ఎంపీటీసీల రిజర్వేషన్‌లు..

నాగారం, పత్తిపాక (ఎస్టీ జనరల్), అలంకానిపేట(ఎస్టీ మహిళ), గొల్లపల్లి (ఎస్టీ మహిళ), పెద్దకొర్పోలు (ఎస్టీ మహిళ), బంజరుపల్లి ఎస్సీ (మహిళ), వెంకటాపురం (ఎస్సీ జనరల్), సూరిపల్లి (బీసీ జనరల్), దీక్షకుంట(బీసీ జనరల్),నెక్కొండ(బీసీ జనరల్)నెక్కొండ(బీసీ మహిళ), రెడ్లవాడ, (బీసీ మహిళ), గుండ్రపల్లి (బీసీ జనరల్), టీకే తండా (బీసీ మహిళ), అప్పల్‌రావుపేట (జనరల్ మహిళ), బొల్లికొండ (జనరల్).

సర్పంచ్ రిజర్వేషన్‌లు..

అజ్మీరామంగ్యాతండా (ఎస్టీ జనరల్), దేవునితండా (ఎస్టీ జనరల్), హరిచంద్‌తండా (ఎస్టీ జనరల్), మూడ్‌తండా (ఎస్టీ జనరల్), నక్కల గుట్టతండా (ఎస్టీ జనరల్), వెంకట్‌నాయక్‌తండా (ఎస్టీ జనరల్), పత్తిపాక (ఎస్టీ జనరల్), బంజరుపల్లి (ఎస్టీ జనరల్), నెక్కొండతండా (ఎస్టీ జనరల్), చెరువుముందుతండా (ఎస్టీ మహిళ), లావుడ్యావాగ్యానాయక్ తండా (ఎస్టీ మహిళ), మైబునాయక్‌తండా (ఎస్టీ మహిళ), పిటికాలబోడుతండా(ఎస్టీ మహిళ), రామన్నకుంటతండా (ఎస్టీ మహిళ), రెడ్యానాయక్‌తండా (ఎస్టీ మహిళ), టీకే తండా (ఎస్టీ మహిళ), వెంకటాపురం (ఎస్టీ మహిళ), చిన్నకొర్పోలు (ఎస్టీ మహిళ), దీక్షకుంట(ఎస్సీ జనరల్), కస్నాతండా (ఎస్సీ జనరల్) , అమీన్‌పేట (ఎస్సీ మహిళ), పెద్దకొర్పోలు (ఎస్సీ మహిళ), అలంకానిపేట (బీసీ జనరల్) , గొల్లపల్లి (బీసీ జనరల్) , సురిపల్లి (బీసీ జనరల్) , పనికర(బీసీ జనరల్) , నెక్కొండ (బీసీ జనరల్), చంద్రుగొండ (బీసీ జనరల్), గుండ్రపల్లి (బీసీ మహిళ), నాగారం (బీసీ మహిళ), ముదిగొండ (బీసీ మహిళ), సాయిరెడ్డిపల్లి (బీసీ మహిళ), సీతారాంపురం (బీసీ మహిళ), అప్పల్‌రావుపేట (జనరల్ మహిళ), బొల్లికొండ(జనరల్ మహిళ), తోపనపల్లి (జనరల్ మహిళ), గొట్లకొండ (జనరల్), మడిపల్లి (జనరల్), రెడ్లవాడ (జనరల్)లకు కేటాయించారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



నర్సంపేట మునిసిపల్ పరిధి మాదన్నపేటలో నీరునిలిచి దెబ్బతిన్న పత్తితోటను పరిశీలిస్తున్న ఎంసీపీఐ(యూ) నాయకులు

నర్సంపేట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరుసగా కురుస్తున్న వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఎంసీపీఐ(యూ) జిల్లా నాయకులు వంగలరాగసుధ, కొత్తకొండ రాజమౌళి, ఏఐకెఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశెట్టి సదానందం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నర్సంపేట మునిసిపల్ పరిధిలోని మాధన్నపేటలో వర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి, మొక్కజొన్న పంటలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలతో పత్తిపంటలు నీటమునిగి, పంటంతా ఎర్రబడి, కాయలు నల్లబడి దెబ్బతిని అక్కరకు రాకుండా పోయాయని దీంతో రైతులు తీ వ్రంగా నష్టాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల చొప్పున నష్టపరిహారం అందించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దెబ్బతిన్న పంటలను సర్వేచేయించి రైతులకు పరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో అనుమాల రమేష్, కందికొండ సాంబయ్య, గుర్రం రవి, ఆకుల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రూ:50వేల చొప్పున పరిహారం అందించాలి..

వర్షాలతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేల చొప్పున పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఎలకంటి రాజేందర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని రెవెన్యూడివిజన్ కార్యాలయ ఉద్యోగికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికవర్షాల వల్ల పత్తి, మొక్కజొన్న పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. యూరియా కోసం ఇబ్బందులను ఎదుర్కొన్న రైతులు వర్షాలతో పంటలు దెబ్బతినడంతో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంటనష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతుకూలి సంఘం జిల్లా అధ్యక్షుడు జక్కుల తిరుపతి, గట్టి కృష్ణ, పాణి, మల్లన్న, కిషన్, గొర్రె ప్రదీప్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

గీసుగొండ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. కొనాయిమాకుల రైతువేదికలో గీసుగొండ, సంగెం మండలాలతో పాటు 15,16,17 డివిజన్‌లకు చెందిన 124 మంది కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు రూ.1.24కోట్ల విలువ గల చెక్కులను, 36 మందికి రూ.11.52 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను అందచేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో పార్టీలకు అతీతంగా అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రాన్ని దోచుకున్న లక్షల కోట్ల ధనాన్ని పంచుకోవటానికి కేసీఆర్ కుటుంబంలో పోరాటం జరుగుతుందన్నారు. లిక్కర్‌కింగ్‌గా కవిత దేశస్థాయిలో పేరుగాంచిందన్నారు. మాయ మాటలు చెప్పడంలో కేసీఆర్ కుటుంబం దిట్టలు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న సీఎం రిలీఫ్‌ఫండ్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందిస్తున్నట్లు చెప్పారు. పరకాల ఎమ్మెల్యేగా 500 కల్యాణలక్ష్మి చెక్కులను అందచేసిన సందర్భంగా ఆయన భారీ కేక్‌ను కట్‌చేసి స్వీట్లను పంచారు. కొనాయిమాకుల రైతు వేదిక వద్ద ఇందిర మహిళా శక్తి చేపల విక్రయ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్‌లు రియాజుద్దిన్, రాజ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ పేదల పక్షం..

సగెం (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పేదల పక్షాన నిలిచి అభివృద్ధి చేస్తున్నదని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి చెప్పారు. శనివారం హనుమకొండలోని ఆయన స్వగృహంలో మండలంలోని కుంటపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో వారందరి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంటు మెట్టుపల్లి రమేశ్, మార్కెట్ డైరెక్టర్ అచ్చ నాగరాజు, బొల్లబోయిన కిషోర్ యాదవ్, కాగితాల జగన్నాధచారి తదితరులు పాల్గొన్నారు.

నేడు మహబూబాబాద్‌లో నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ సభకు తరలివెళ్లాలి

• లంబాడీ హక్కుల జేఏసీ మండల కన్వీనర్ దారవతు రాజు



మాట్లాడుతున్న దారవతు రాజు

దుగ్గొండి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లో ఆదివారం నిర్వహించే లంబాడీల ఆత్మగౌరవ ర్యాలీ, సభకు ఎక్కువ సంఖ్యలో లంబాడ శ్రేణులు తరలి వెళ్లాలని లంబాడ హక్కుల జేఏసీ కన్వీనర్ దారవతు రాజు పిలుపు నిచ్చారు. మండల కేంద్రంలో శనివారం రాజు మాట్లాడుతూ లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్ జాబితా నుంచి తొలగించాలని కొంత మంది చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలన్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిర్వహించే సభకు మండలంలోని అన్ని తండాలకు చెందిన విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగ మేధావులు, ప్రజా సంఘాల వారు హాజరు కావాలన్నారు. గత కొంత కాలం నుంచి ఉన్నటువంటి రిజర్వేషన్‌ల నుంచి లంబాడీలను తొలగించుటకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకునే విధంగా అందరూ కలసి కట్టుగా ఉద్యమించాలన్నారు.

ఎడతెరపి లేని వర్షం.. కూలిన ఇల్లు

నల్లబెల్లి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. శనివారం భారీ వర్షం కురవడంతో మండలంలోని గాంధీనగర్ గ్రామంలో ఆవుల రమేష్ ఇల్లు కూలిపోయింది. గత మూడు రోజులు ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండడంలో మట్టిగోడలు నానిపోయి ఇల్లు కూలిపోయిందన్నారు. ఇల్లు కూలిపోయే క్రమంలో ఇంట్లో ఎవరులేని కారణంగా పెద్ద ప్రమాదమేమి జరగలేదన్నారు. అలాగే భారీ వర్షం కరవడంతో రుద్రగూడెం, మామిండ్లవీరయ్యపల్లి గ్రామాల మధ్యనున్న రొడ్డం వాగు దాటనియకపోవడంతో రాకపోకలు ఆగిపోయాయని గ్రామస్తులు తెలియజేశారు. అంతేకాక, గ్రామాల్లో సైడు కాల్వలు లేకపోవడంతో వర్షపునీరు ఇంటి ముందుకు భారీగా వచ్చాయని గ్రామస్థులు ఆరోపించారు.

పేలిన బస్సు టైర్.. ప్రయాణికులు సురక్షితం

సంగెం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నుంచి గవిచర్ల మీదుగా అన్నారం వెళ్తున్న ప్రైవేటు ఆర్టీసీ బస్సు టైర్ పేలడంతో బస్సులోని ప్రయాణీకులు భయందోళనకు గురైన సంఘటన శనివారం జరిగింది. మండలంలోని గవిచర్ల గ్రామ సమీపంలో బస్సు వెనుక చక్రం టైర్ పేలడంతో వెంటనే అప్రమత్తమైన డ్రైవర్ మహేష్ చాకచక్యంగా బస్సును నిలిపి వేశాడు దీంతో బస్సులోని ప్రయాణీకులంతా ఊపిరిపీల్చుకున్నారు. బస్సులో సుమారు 55-60 మంది ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఆనంతరం ప్రయాణీకుంతా వేరు వేరు వాహనాలల్లో తమ గమ్య స్థానాలకు తరలి వెళ్లారు.

ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుకు సన్మానం



ఎమ్మెల్యే కేఆర్ నాగరాజును సన్మానిస్తున్న నందిపాక భాస్కర్

వర్ధన్నపేట సెప్టెంబర్ 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణ కేంద్రంలోని ఆకేరు అభివృద్ధికి కృషిచేయాలని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించడంతో స్పందించిన ఎమ్మెల్యే నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి నిధుల మంజూరు చేయడానికి కృషిచేసినందుకు పట్టణ కేంద్రానికి చెందిన నందిపాక భాస్కర్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు, మార్నేని రవీందర్‌రావులను శాలువలతో ఘనంగా సన్మానించారు. వర్ధన్నపేట మునిసిపాలిటీ అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరులో భాగంగా ఆకేరు వాగు ఒడ్డున పార్కు అభివృద్ధికి రూ.50 లక్షలు నిధులు కేటాయించడం సంతోషంగా ఉంద భాస్కర్ అన్నారు. పనులు త్వరగా ప్రారంభించి పూర్తిచేయాలని ఎమ్మెల్యే నాగరాజును వేడుకున్నారు. ఆకేరు వాగుపై పార్కు అభివృద్ధి చేసినట్లయితే వర్ధన్నపేట రుపురేఖలు మారుతాయని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మునిసిపాలిటీ ఇన్‌చార్జి అనిమిరెడ్డి కృష్ణరెడ్డి, పట్టణ అధ్యక్షుడు మైస సురేశ్, మాజీ కౌన్సిలర్‌లు సమ్మెట సుధీర్, రవీందర్, బెజ్జం పపారావు, అంతోతు భిక్షపతి పాల్గొన్నారు.